

మొంథా తుఫాను ప్రభావంతో జరిగిన పంట నష్టాలను అధ్యయనం చేసేందుకు కేంద్ర బృందం జిల్లాలో పర్యటించింది. కంకిపాడు మండలం పునాదిపాడులో వరి పొలంలో దిగి పంటను పరిశీలించింది. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకుంది. గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను తిలకించింది. జరిగిన నష్టం, ముందస్తు నివారణ చర్యల గురించి కలెక్టర్ బాలాజీని అడిగి తెలుసుకుంది.



పునాదిపాడులో వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

80 శాతానికి పైగా నష్టం

30 ఎకరాలు కౌలుకు తీసుకుని వరి పంట సాగు చేశా. తుఫాను కారణంగా 80 శాతం పంట దెబ్బతింది. ఇప్పటి వరకు ఎకరాకు సుమారు రూ. 30 వేల నుంచి రూ.35 వేల వరకు ఖర్చు పెట్టా. కోతకు మరో రూ.10 వేలు ఖర్చు అవుతుంది. కోత కోసినా పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తమను ఆదుకోవాలి.

- తూముల శ్రీనివాసరావు, రైతు, పునాదిపాడు

మొంథాపై అధ్యయనం

- జిల్లాలో పర్యటించిన కేంద్ర ప్రత్యేక బృందం
- కంకిపాడు మండలం పునాదిపాడులో క్షేత్రస్థాయి పర్యటన
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు
- రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్న బృందం సభ్యులు
- పంట, ఆస్తి నష్టాలపై గన్నవరంలో ఫొటో ఎగ్జిబిషన్
- నష్ట నివారణ చర్యలపై ఆరా!



జిల్లాలో నష్టం వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ బాలాజీ, చిత్రంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు


కంకిపాడు/గన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు అంతర మంత్రిత్వ కేంద్ర బృందం (ఐఎంసీటీ) సోమవారం జిల్లాలో పర్యటించింది. కంకిపాడు మండలం పునాదిపాడు గ్రామంలో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించింది. ఈ సందర్భంగా బృందంలోని అధికారులు రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్, శాస్త్రవేత్త పాలడుగు సత్యనారాయణ పంట నష్ట వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. దెబ్బతిన్న కంకులు, బాగున్న కంకుల మధ్య వ్యత్యాసాన్ని ప్రత్యక్షంగా చూపారు. సుమారు 80 శాతం పంట దెబ్బతిన్నట్టు చెప్పారు. ఈ కేంద్ర బృందంలో మిగతా 6లో..

కేంద్ర బృందం దృష్టికి జిల్లా సమగ్ర వివరాలు

● కలెక్టర్ బాలాజీ, ప్రభుత్వ విప్ యార్లగడ్డ

జిల్లాలో మొంథా తుఫాను ప్రభావంతో జరిగిన నష్టాలను కేంద్ర బృందానికి సమగ్రంగా వివరించామని కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. సోమవారం గన్నవరం ఎంపీడీవో కార్యాలయంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను అంతర మంత్రిత్వ కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ నష్టం వివరాలను కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో 228 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 23,744 మందిని తరలించామన్నారు. తుఫాను ప్రత్యేక జోనల్ అధికారిగా ఆర్పీ సిసోడియా, జిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి నేతృత్వంలో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో వీచిన గాలులకు వరి పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. దెబ్బతిన్న రైతులకు న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వ అధికారులను కోరామన్నారు.

భరతమాత చిత్రపటాన్ని ఆసక్తిగా తిలకిస్తున్న సీఎం చంద్రబాబు



పాడవోయి విజయగీతిక

- ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు పిలుపు
- నగరంలో మార్మోగిన వందేమాతర గేయం
- ఏడాది పాటు 150 ఏళ్ల ఉత్సవాలకు శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ) : దేశభక్తి ఉప్పొంగింది. వందేమాతరం గీతం అంతటా మార్మోగింది. ఈ గేయం పుట్టి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఉత్సవాలను శ్రీకారం చుట్టింది. జిల్లా అధికార యంత్రాంగం, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సోమవారం ఏడాది పాటు జరిగే ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సీఎం చంద్రబాబు స్ఫూర్తిదాయకమైన ప్రసంగం అందరిలో దేశభక్తిని రగిల్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఏడాది పాటు ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈనెల 7 నుంచి వచ్చే ఏడాది నవంబరు 7 వరకు నాలుగు దశలుగా ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు. ఈనెల 7 నుంచి 14వ తేదీ వరకూ మొదటి దశలో ప్రారంభ వారోత్సవం, 2026, జనవరి 19 నుంచి 26 గణతంత్ర దినోత్సవం వరకు రెండో దశ, ఆగస్టు 7 నుంచి 15 స్వాతంత్ర్య దినోత్సవం వరకు హర్‌ఘర్ తిరంగా వారోత్సవాల్లో భాగంగా మూడో దశ, నవంబరు 1 నుంచి 7 వరకు నాల్గో దశలో ముగింపు వారోత్సవాలు నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు.

ఆకట్టుకున్న స్టాల్స్

ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్టాల్స్ ఆకట్టుకున్నాయి. స్వాతంత్ర్యానికి సంబంధించిన పోస్టర్లను ఈ స్టాల్‌లో ప్రదర్శించారు. స్టాల్‌ను సీఎం చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. పలు రకాల పోస్టర్ల గురించి సీఎంకు కలెక్టర్ జి.లక్ష్మీశ, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మల్లికార్జునరావు వివరించారు. కళాకారుల బృందం ఆలపించిన వందేమాతర గీతం సభికులను ఆకట్టుకుంది.

ప్రతి గొంతులో వందేమాతరం ప్రతిధ్వనించాలి : సీఎం

వందేమాతరం నినాదంలో శక్తి, పోరాటం, పౌరుషం, తిరుగులేని దేశభక్తి ఉన్నాయని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం ప్రపంచంలోనే భిన్నమైదని, నాడు అందరిలో జాతీయభావన, ఐక్యతను తీసుకొచ్చి ఉద్యమ జ్వాలలు రగిల్చిన నినాదం మిగతా 6లో..

హై టెన్షన్!

- పశ్చిమ బైపాస్ పనులకు మరో అడ్డంకి
- నున్నలో హైటెన్షన్ టవర్ల ఏర్పాటు వివాదం
- బైపాస్ పక్కన టవర్ల ఏర్పాటు పనులు
- రైతులు, ప్లాట్ల యజమానుల అడ్డగింపు
- రోడ్డుపై స్తంభం ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్న



స్తంభం ఏర్పాటు ప్రాంతంలో రైతులు, ప్లాట్ల యజమానుల ఆందోళన

విజయవాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పశ్చిమ బైపాస్ వద్ద హైటెన్షన్ స్తంభాలు ఏర్పాటు వ్యవహారం మరోసారి వివాదాస్పదమైంది. బైపాస్ పక్కన విద్యుత్ స్తంభం ఏర్పాటుకు ట్రాన్స్‌కో పనులు చేపట్టగా, సోమవారం రైతులు, ప్లాట్ల యజమానులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాలకు కొంత వాగ్వాదం జరిగింది. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని ఇరువర్గాలతో సంప్రదింపులు జరిపారు.

పనులకు అడ్డు

నున్న పంచాయతీ పరిధిలో కొంతకాలంగా పశ్చిమ బైపాస్ పనులు జరుగుతున్నాయి. పలుచోట్ల హైటెన్షన్ విద్యుత్ వైర్లు బైపాస్‌కు తక్కువ ఎత్తులో ఉండటంతో వాటిని మళ్లించే పనులు జరుగుతుండగా, స్థానిక రైతులు, ప్లాట్ల యజమానులు, నిర్మాణ పనులు చేపడుతున్న అధికారులు, ట్రాన్స్‌కోకు వివాదం నడుస్తోంది. ఈ క్రమంలో నాలుగు రోజులుగా జనచైతన్య వెంచర్ ముందు భాగంలో భారీ గోతులు తవ్విన ట్రాన్స్‌కో అధికారులు హైటెన్షన్ స్తంభాన్ని ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టారు. విషయం తెలుసుకున్న రైతులు, వెంచర్‌లోని ప్లాట్ల యజమానులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు.

రోడ్డుపై స్తంభమా?

ప్రస్తుతం ట్రాన్స్‌కో స్తంభాన్ని ఏర్పాటు చేస్తున్న స్థలం.. రోడ్డుకు సంబంధించినదని రైతులు, ప్లాట్ల యజమానులు చెబుతున్నారు. ప్లాన్ ప్రకారం ట్రాన్స్‌కో స్తంభం ఏర్పాటుచేస్తున్న ప్రాంతం 80 అడుగుల రోడ్డు అని, ఆ రోడ్డుపై స్తంభం ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయని స్థానికులు మిగతా 6లో..

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రంగం సిద్ధమైంది. కూటమి ప్రభుత్వంలోనైనా మంగినపూడి బీచ్‌కు మహర్దశ వస్తుందని జిల్లా వాసులు ఆశలు పెట్టుకున్నారు. వీరి నమ్మకాన్ని నిజం చేస్తూ మంగినపూడి బీచ్ (తాళ్లపాలెం బీచ్)ను అభివృద్ధి చేసేదిశగా ప్రభుత్వం సోమవారం జరిగిన క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంది. అమ్యూజ్‌మెంట్ పార్క్‌తో పాటు రిసార్ట్‌ల నిర్మాణం కోసం మైరా బేవ్యూ రిసార్ట్స్ సంస్థకు భూమిని కేటాయించే అంశానికి ఆమోదం తెలిపింది. ఈ నెల 7వ తేదీన ఎస్ఐపీబీ సమావేశంలో మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేయాలని, పర్యాటకులను ఆకర్షించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయాన్ని క్యాబినెట్ సమావేశంలో ఆమోదం కోసం ఉంచగా, రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపింది.



మంగినపూడి బీచ్

పర్యాటకానికి ఊతం

- మచిలీపట్నం నార్త్ మండలం తాళ్లపాలెం వద్ద 'మైరా' రిసార్ట్‌లు!
- భూముల కేటాయింపునకు క్యాబినెట్ ఆమోదం
- మచిలీపట్నంలో టీడీపీ కార్యాలయానికి 1.60 ఎకరాలు కేటాయింపు
- వేద ఇన్నోవేషన్ పార్క్, ప్లాటెడ్ ఫ్యాక్టరీ పనులను నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం): మచిలీపట్నంలో ప్రతిష్ఠాత్మకమైన బందరు పోర్టు పనులు ఇప్పటికే 40శాతం పూర్తయ్యాయి. పోర్టు అభివృద్ధి చెందితే వ్యాపారులు, ఇతరత్రా సంస్థల వారు ఇక్కడకు వస్తారు. ఈ నేపథ్యంలో వివిధ పనులపై మచిలీపట్నం వచ్చేవారికి ఆహ్లాదాన్ని పంచేందుకు స్టార్ హోటల్స్ యజమానులు మంగినపూడి బీచ్ సమీపంలో త్రీస్టార్, ఫైవ్‌స్టార్ హోటల్స్ నిర్మాణం చేస్తామనే ప్రతిపాదనలతో ముందుకు వచ్చారు. తమకు భూములు కేటాయిస్తే రూ.150 కోట్ల పెట్టుబడితో ఇక్కడ స్టార్ హోటల్స్ నిర్మాణం చేస్తామనే ప్రతిపాదనలు కూడా పెట్టారు. వన్‌స్టార్, ఒబెరాయ్, మైరా బేవ్యూ రిసార్ట్స్ వంటి సంస్థలు ముందుకు వచ్చి 100 ఎకరాల భూమిని కేటాయించాలని కోరాయి. ఈ ప్రతిపాదనలపై రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులు పలుమార్లు కలెక్టర్‌తో సమావేశాలు కూడా నిర్వహించారు. మంగినపూడి బీచ్ ఎదురుగా 80 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. 20 సంవత్సరాల క్రితం రిసార్ట్‌ల నిర్మాణానికి ఈ భూమిని కేటాయించారు. భూమిని తీసుకున్న రిసార్ట్‌ల నిర్వాహకులు పెద్ద ఎత్తున భవనాలు నిర్మాణం చేసి పర్యాటకులకు సౌకర్యాలు కల్పించాల్సి ఉండగా, నామ మాత్రంగా రెండు, మూడు భవనాలు నిర్మాణం చేసి మమ అనిపించారు. దీంతో ఈ రిసార్ట్‌లు నామమాత్రంగానే ఉండిపోయాయి. ఏడాదిన్నర కాలం క్రితం ఒబెరాయ్, వన్‌స్టార్ వంటి సంస్థల ప్రతిపాదనలను దృష్టిలో పెట్టుకుని బీచ్ ఎదురుగా ఉన్న 80 ఎకరాలతో పాటు తాళ్లపాలెం పంచాయతీ పరిధిలోని సత్రవపాలెంలోని ప్రభుత్వ భూములను అధికారులు సర్వే చేయించారు. ఇక్కడ హోటల్స్ నిర్మాణానికి భూములు కేటాయించే ప్రతిపాదనలు మిగతా 6లో..

మరింత కిక్కు

- నకిలీ మద్యం కేసులో పెరుగుతున్న నిందితులు
- సాంకేతికంగా దర్యాప్తు చేపట్టిన సిట్ అధికారులు
- త్వరలో మరికొంత మందిని అరెస్టు చేసే అవకాశం
- అద్దేపల్లి ఆర్థిక లావాదేవీలపై ఆరా
- తెలంగాణలోని సన్నిహితులను పిలిపించే యోచన
- సీడీ ఫైలు నుంచి మనోజ్ కొఠారి తొలగింపు?
- ఆ స్థానంలో మనోజ్‌కుమార్ జైన్ పేరు చేర్పు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : నకిలీ మద్యం తయారీ కేసుతో సంబంధం ఉన్న అద్దేపల్లి జనార్దనరావు, జగన్మోహనరావు సోదరులు ఇప్పటికే కటకటాల వెనక్కి వెళ్లారు. జనార్దనరావుతో పాటు ఈ ఫార్ములాను నడిపించిన మాజీమంత్రి జోగి రమేశ్, ఆయన సోదరుడు రాముకు సిట్ సంకెళ్లు వేసింది. కొద్దిరోజుల క్రితం ఏడుగురు నిందితులను సిట్ అధికారులు కస్టడీకి తీసుకుని విచారించారు. ఇందులో ముగ్గురు కీలక సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. వారిచ్చిన వాంగ్మూలం ఆధారంగా నకిలీ కిక్‌తో సంబంధాలు నడిపిన వ్యక్తులను విచారించడానికి సిట్ అధికారులు రంగం సిద్ధం చేశారు. విచారణకు హాజరుకావాలని త్వరలో వారికి నోటీసులు అందజేయాలని చూస్తున్నారు. అద్దేపల్లి సోదరులు నకిలీ మద్యం తయారీకి అనేక మందితో ఆర్థిక లావాదేవీలు నిర్వహించినట్టు గుర్తించారు. అద్దేపల్లికి తెలంగాణాలో అండగా ఉన్న వారిని విచారణకు పిలిపించే యోచనలో ఉన్నారు. ఈ విచారణ ప్రక్రియ పూర్తయ్యాక మరో నలుగురైదుగురు నిందితులకు సంకెళ్లు పడే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. కస్టడీలోని నిందితులు ఇచ్చిన వాంగ్మూలాల ఆధారంగా సిట్ అధికారులు సాంకేతికంగా దర్యాప్తును సాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ కేసులో ఎక్సైజ్ పోలీసులు 23 మందిని నిందితులుగా కోర్టుగా అందజేసిన కేసు డైరీలో పేర్కొన్నారు. ఈ జాబితా

'ఆర్థిక' ఆధారాల్లో ఇరుక్కున్న మనోజ్

అద్దేపల్లి జనార్దనరావు సోదరులకు ప్లాస్టిక్ మూతలపై బ్రాండ్లను ముద్రించి మరీ సరఫరా చేసిన వ్యక్తి మనోజ్‌కుమార్ జైన్ అలియాస్ మనోజ్ ముతా. నకిలీ మద్యం తయారీ కేసులో మనోజ్‌కుమార్ అతి తెలివిని ప్రదర్శిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటి వరకు జనార్దనరావు ఎవరో తనకు తెలియదని, అతడితో ఎలాంటి వ్యాపారం చేయలేదని పదేపదే చెప్పాడు. అతడు ఏస్థాయిలో పాత్ర పోషించాడన్న దానిపై సిట్ అధికారులు ఆధారాలను సేకరించారు.



చల్లపల్లి మండలం లక్ష్మీపురంలో ప్రత్యేక అలంకరణ

గుడివాడ పట్టణంలోని శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక సందడి

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి వత్తులు వెలిగించారు.

జిల్లాలోనే మోడల్‌గా నున్న సొసైటీ

- ఎమ్మెల్యే యార్లగడ్డ, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్
- రూ. 1.10 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన 6

శివోహం..



» పుణ్యస్నానాలతో కిటకిటలాడిన దుర్గాఘాట్

» శివాలయాల్లో భక్తుల రద్దీ

ఇంద్రకీలాద్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారంను పురస్కరించుకుని దుర్గగుడి దిగువన ఉన్న దుర్గాఘాట్ వద్ద కృష్ణానదిలో భక్తులు పుణ్యస్నానాలతో కిటకిటలాడింది. తెల్లవారుజామునుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్యస్నానాలాచరించి కార్తీకదీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. కృష్ణమ్మకు పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో దుర్గాఘాట్‌లో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. శానిటేషన్ సిబ్బంది ఎప్పటికప్పుడు ఘాట్‌ను శుభ్రం చేసి, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను తొలగించారు. పుణ్యస్నానాలనంతరం భక్తులు దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మల్లేశ్వరస్వామివారిని, కొండ దిగువన ఉన్న విజయేశ్వరస్వామి వారిని, శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావటంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ముందస్తు జాగ్రత్తగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. వన్‌టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.





ఘాట్ల వద్ద శివ పూజల్లో భక్తులు

మల్లేశ్వరునికి అభిషేకాలు

ఇంద్రకీలాద్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా భక్తుల రద్దీ అధికంగా ఉంది. పవిత్రమైన సోమవారాన్ని పురస్కరించుకుని మల్లేశ్వరశ్వర స్వామికి వేకువజాము నుంచే విశేష అభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులయ్యారు. ఈవో వీకే శీనానాయక్



స్వయంగా శివాలయాన్ని సందర్శించి, భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనం అనంతరం ఈవో తెలంగాణ రాష్ట్రం, మధిర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులతో మాట్లాడి వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. భక్తులు మాట్లాడుతూ, సంప్రదాయం ప్రకారం తాము రాత్రి ఇక్కడే దుర్గగుడిలో బస చేశామని, గత పర్యటనతో పోలిస్తే ప్రస్తుతం మహా మండపం వద్ద స్నానపు గదులు (బాత్‌రూమ్‌లు), పారిశుద్ధ్యం (శానిటేషన్), ఇతర సౌకర్యాలు ఎంతో మెరుగయ్యాయని, ప్రస్తుత దేవస్థానం యాజమాన్యం కల్పించిన సదుపాయాలపై తాము సంతృప్తిగా ఉన్నామని తెలిపారు. దుర్గమ్మ ఆలయం, శివాలయం మెట్ల దగ్గర పూజా మండపంలో రుద్ర హోమం అర్చకస్వాములు ఘనంగా నిర్వహించారు. అర్చకులు మంగళ్‌కుమార్ శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు.



పోరంకి వేదపాఠశాలలో వసతులను పరిశీలిస్తున్న చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్, స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ

పోరంకిలో గోశాలషెడ్డు విస్తరణకు చర్యలు

» దుర్గగుడి చైర్మన్, ఈవో

ఇంద్రకీలాద్రి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోరంకిలో దుర్గగుడి గోశాల షెడ్డును మరింత విస్తరించే దిశగా చర్యలు తీసుకోవాలని చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈవో వీకే శీనానాయక్‌లు దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పోరంకిలోని దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన వేద పాఠశాలను సోమవారం అధికారుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా వేద పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్య, వసతుల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వేద పాఠశాల పర్యవేక్షకులతో చర్చించారు. గోశాలలో గోవులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విశాలంగా ఉండేందుకు షెడ్డు విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఈవో, చైర్మన్‌లు అధికారులను ఆదేశించారు. క్రీడా మైదానంలో కలుపు మొక్కలు తొలగింపు, బిల్డింగ్ స్లాబ్ రిపేర్లు త్వరతగతిన చేయాలన్నారు. వేదపాఠశాల బయట, లోపల ప్రాంతాలను పరిశీలించారు. అన్నిపనులు పూర్తిచేయాలని ఈఈ రాంబాబు, టీమ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, కార్యనిర్వాహక ఇంజనీర్, ఏఈవో, ఇంజనీరింగ్ సిబ్బంది, వేద పండితులు, పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మనోహర్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న చైర్మన్ రాధాకృష్ణ

దుర్గమ్మ సన్నిధిలో మంత్రి మనోహర్ దంపతులు

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సోమవారం మంత్రి నాదెండ్ల మనోహర్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ బి.రాధాకృష్ణ, ఆలయ అర్చకస్వాములు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచన మండపంలో అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. చైర్మన్ వారికి అమ్మవారి చిత్ర పటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సంగమేశ్వరస్వామి ఆలయం

అభివృద్ధికి కృషి చేయాలి

» ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురామ్

నందిగామ రూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దాములూరు కూడలి గ్రామంలోని సంగమేశ్వర స్వామి ఆలయం అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే తాతయ్య, కేడీసీసీబీ చైర్మన్ నెట్టెం రఘురామ్ సూచించారు. ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో వారు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి దేవదాయ నిబంధనల మేరకు ఆలయ చైర్మన్‌గా గింజుపల్లి శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, కెడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉత్సవాల సమయంలో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాదెల వెంకట రామారావు, నాయకులు తోట నాగమల్లేశ్వరరావు, మన్నేవల్లి వినయ్, ఉప్పుకొండూరు గురుప్రసాద్, చెరుకూరు హైమారావు, చల్లా తులసీరావు, చెరుకూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

మొంథాపై అధ్యయనం

(5వ పేజీ తరువాయి)

జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎంపీ డీటీఈ, సీడబ్ల్యూసీ డైరెక్టర్ శ్రీనివాసు బైరీ, విద్యుత్ మంత్రిత్వ శాఖ సీఈఏ డిప్యూటీ డైరెక్టర్ ఆర్తి సింగ్, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మనోజ్ కుమార్ మీనా ఉన్నారు. వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.పొన్నుసామి నేతృత్వంలో ఈ పర్యటన జరిగింది.

అధికారులు తీసుకున్న చర్యలపై ఆరా!

దెబ్బ తిన్న ధాన్యం, మొలకెత్తకుండా అధికారులు తీసుకున్న చర్యలపై కేంద్ర బృందం ఆరా తీసింది. దీనిపై కలెక్టర్ డి.కె.బాలాజీ వివరణ ఇచ్చారు. పడిపోయిన పైరు, తడిసిన ధాన్యం మొలకెత్తకుండా ఉండేందుకు ధాన్యంపై లీటరు నీటికి ఐదు గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని, పడిపోయి వరి దుబ్బులను నిలబెట్టి కట్టలుగా కట్టుకోవాలని వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు. ఎన్యూమరేషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పూర్తి వివరాలు అందజేశామని వివరించారు. ఈ పర్యటనలో రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకులు, పౌరసరఫరాల సంస్థ ఎండీ, ప్రత్యేక అధికారి ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, నోడల్ అధికారి పోతురాజు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.పద్మావతి, ఉయ్యూరు ఆర్డీవో షారోన్, తహసీల్దార్ భవన్నారాయణ, ఏవో ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కౌలు రైతులకు ఇవ్వాలి

- పాలకంపల్లి వెంకటదుర్గాప్రసాద్, కౌలు రైతు

ఎకరాకు రూ.30వేల నుంచి రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టా. తుఫాను పంట దెబ్బతింది. అయినా కౌలు చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం అందిస్తున్న ఇన్‌పుట్ సబ్సిడీ, నష్ట పరిహారాన్ని నేరుగా కౌలు రైతుల ఖాతాల్లో జమ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.

నిబంధనలను సడలించాలి

- వడ్డే శోభనాద్రీశ్వరరావు, మాజీ మంత్రి

ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడిన సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న నిబంధనలను సడలించాలి. బ్యాంకులద్వారా తీసుకున్న రుణాలను వాయిదావేసి మరల పంటరుణాలను అందించాలి. పంటల బీమా పథకం ఇన్సూరెన్స్ కంపెనీలకు ఉపయుక్తంగా మారిందే తప్ప రైతులకు ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయింది. నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి.

పర్యాటకానికి ఊతం

(5వ పేజీ తరువాయి)

తయారు చేసినా, ప్రభుత్వ ఆమోదం ఇంతకాలంగా లభించలేదు. ఎట్టకేలకు సోమవారం జరిగిన కేబినెట్ సమావేశంలో మంగినపూడి బీచ్ సమీపంలో పర్యాటక రంగం అభివృద్ధి కోసం రీసార్ట్‌ల నిర్మాణానికి ఆమోదం లభించింది.

మసులా బీచ్ ఫెస్టివల్‌తో పర్యాటక రంగం అభివృద్ధికి బీజం

ఈ ఏడాది జూలైలో నిర్వహించిన మసులాబీచ్ ఫెస్టివల్ సందర్భంగా మచిలీపట్నానికి ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చారు. మసులా బీచ్ ఫెస్టివల్‌కు వచ్చిన అర్జున అవార్డు గ్రహీతలు, వివిధ క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులతో మంత్రి కొల్లు రవీంద్ర, శాప్‌చైర్మన్ రవినాయుడు, కలెక్టర్ బాలాజీ చర్చలు జరిపారు. మంగినపూడి బీచ్, గిలకలదిండి హార్బర్ తదితర ప్రాంతాల్లో బీచ్ కబడ్డీ పోటీలు, జలక్రీడలు, కయాకింగ్ పోటీల నిర్వహణ కోసం తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడారు. దీంతో పాటు క్రీడాకారులకు కోచింగ్ ఇచ్చేందుకు ఎలాంటి సౌకార్యలు కల్పించాలనే అంశంపైనా, అందుకు అవసరమైన భూమి, నిధుల కేటాయింపు తదితర అంశాలపై కూడా చర్చించారు. తొలి విడతగా మంగినపూడి బీచ్‌ను అభివృద్ధి చేస్తే రానున్న రోజుల్లో వ్యాపారసంస్థలు, హోటల్స్ నిర్మాణంతోపాటు ఇతరత్రా వ్యాపారాలను విస్తరించేందుకు అవకాశాలు మెరుగవుతాయి.

టీడీపీ కార్యాలయానికి భూమి కేటాయింపు

మచిలీపట్నం నార్త్ మండలంలోని మాచవరంలో ఆర్ఎస్ నెంబరు 258/8లో 1.60 ఎకరాల ప్రభుత్వ భూమిని 33 సంవత్సరాల పాటు లీజుకు ఇస్తూ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఎకరానికి ఏడాదికి వెయ్యి రూపాయిలు లీజు చెల్లించాలని నిర్ణయించింది. గతంలో రవాణాశాఖకు ఈ భూమిని కేటాయించగా, సంబంధిత ఉత్తర్వులను రద్దు చేసి, టీడీపీ కార్యాలయం నిర్మాణం కోసం ఈ భూమిని బదిలీ చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

వేలేరులో వేద ఇన్నోవేషన్ పార్క్‌కు 40 ఎకరాలు

గన్నవరం నియోజకవర్గంలోని వేలేరులో వేద ఇన్నోవేషన్ పార్క్‌కు 40 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. వేద ఇన్నోవేషన్ పార్క్ నిర్మాణ పనులతో పాటు, మచిలీపట్నం నియోజకవర్గంలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం అనకాపల్లి జిల్లా నుంచి వర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన చేయనున్నారు. కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదిక ద్వారా అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారు.

హై టెన్షన్!

(5వ పేజీ తరువాయి)

ఆవేదన చెందుతున్నారు. పైగా హైటెన్షన్ స్తంభం ఏర్పాటు చేసేందుకు ఏపీ ట్రాన్స్‌కో, ఎన్‌హెచ్ అధికారుల వద్ద ఎలాంటి అనుమతులు లేవని, బెదిరింపులకు గురిచేసి బలవంతంగా స్తంభం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు, ప్లాట్ల యజమానులు పేర్కొంటున్నారు. వందలాది ఎకరాల పొలాల రైతులు వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకునేందుకు, 245 ప్లాట్ల యజమానులకు ఉపయోగపడే రోడ్డు మధ్యలో స్తంభం ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కాగా ప్రస్తుతం స్తంభం ఏర్పాటు చేస్తున్న ప్రదేశం కామన్ స్థలమని ప్రభుత్వ అవసరాలకు వినియోగించుకునే అవసరం ఉందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలోనే మోడల్‌గా నున్న సొసైటీ

» ఎమ్మెల్యే యార్లగడ్డ, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురామ్

» రూ. 1.10 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన

విజయవాడ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోనే నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) సొసైటీ మోడల్ సొసైటీగా నిలిచిందని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్‌లు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని పీఏసీఎస్‌లో రూ.1.10 కోట్ల వ్యయంతో చేపటనున్న కళ్యాణ మండపం ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి యార్లగడ్డ, నెట్టెం రఘురామ్ ముఖ్య అతిథులుగా హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.3.46 లక్షల డివిడెండ్‌ను సభ్యులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, రూ.79 కోట్ల వార్షిక వ్యాపార లావాదేవీలను సాధించి రూ. 2.14 కోట్ల లాభాన్ని నున్న గ్రామ సొసైటీ సాధించడం అభినందనీయమన్నారు. అలాగే వివిధ గ్రామాల్లో కుంచించుకుపోయిన రహదారులను విస్తరించి అభివృద్ధి చేయనున్నట్టు తెలిపారు. గ్రామస్థుల సహకారంతో గ్రామంలోని పవర్‌గ్రిడ్ నుంచి నున్న సెంటర్ వరకు ఉన్న ప్రధాన రహదారిని 100 అడుగులకు విస్తరించి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. అనంతరం సొసైటీ మాజీ డైరక్టర్ భూముల వెంకటరెడ్డి జ్ఞాపకార్థం అతని కుమార్తె, కుమారుడు భూముల బాల శేఖర రెడ్డి కళ్యాణ మండపం నిర్మాణానికి తనవంతుగా రూ. 2 లక్షలు విరాళాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి, డైరక్టర్లు పామర్తి శ్రీనివాసరావు, గంపా శ్రీనివాస్, కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, గన్నవరం ఏఎంసీ డైరక్టర్ జి.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు. గ్రామంలో సొసైటీ తరపున ధాన్యం కొనుగోలు చేయాలని, అలాగే ధాన్యం నిల్వ కేంద్రం నిర్మించాలని చెరువు సెంటర్ వద్ద మూతపడిన ఆర్వో ప్లాంట్‌ను పునరుద్ధరించాలని కోరుతూ వైసీపీ నేతలు వినతిపత్రం అందజేశారు.



కళ్యాణ మండపం నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్

మరింత కిక్కు

(5వ పేజీ తరువాయి)

మరింత పెరిగే అవకాశం ఉంది.

అంతా మాయ

2021 నుంచి అద్దేపల్లి సోదరులు నకిలీ మద్యం తయారీని ప్రారంభించిన విషయం తెలిసిందే. నాటి నుంచి మనోజ్‌కుమార్ వారికి ప్లాస్టిక్ మూతలను విక్రయిస్తూనే ఉన్నాడు. అంతేకాకుండా వాటిపై బ్రాండ్లకు సంబంధించిన ముద్రణ చేయించి మరీ సరఫరా చేశాడు. మనోజ్‌కుమార్‌కు, అద్దేపల్లి సోదరులకు మధ్య ఆర్థిక లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. ఆ ఆధారాలను అధికారులు సేకరించారు. అద్దేపల్లి సోదరుల బ్యాంకు ఖాతాల ద్వారా సాగిన లావాదేవీల లెక్కలను సాంకేతికంగా తేల్చుతున్నారు. ఎక్సైజ్ అధికారులు కోర్టుకు సమర్పించిన కేస్ డైరీ ఫైలులో ఏ20గా మనోజ్ కొఠారిగా పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ తప్పును తనకు అనుకూలంగా మార్చుకుని కేసు నుంచి తప్పించుకోవడానికి మనోజ్‌కుమార్ జైన్ ప్రయత్నాలు చేస్తున్నాడు. మనోజ్‌కుమార్ కొంతమందికి తనను మనోజ్ ముతాగా పరిచయం చేసుకున్నాడు. ఈ రెండు పేర్లు కేసు డైరీలో లేనందున తాను నిందితుడిని కాదనే వాదనను వినిపిస్తున్నాడు. జనార్దనరావు ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఎక్సైజ్ అధికారులు మనోజ్ కొఠారి పేరును ఏ20గా చేర్చారు. ఈ తప్పిదం తిరిగి తమ వైపునకు వస్తుందని గుర్తించిన పోలీసులు న్యాయస్థానంలో త్వరలో ఒక మెమోను దాఖలు చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఏ20 స్థానంలో మనోజ్ కొఠారి పేరును తొలగించి మనోజ్‌కుమార్ జైన్ అలియాస్ మనోజ్ ముతా పేరును చేర్చే యోచనలో ఎక్సైజ్ పోలీసులు ఉన్నట్టు సమాచారం.

పాడవోయి విజయగీతిక

(5వ పేజీ తరువాయి)

వందేమాతరమని పేర్కొన్నారు. ఈ గీతం ప్రతి గొంతులో ధ్వనించాలని పిలుపునిచ్చారు. మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విద్య, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో తప్పనిసరిగా వందేమాతరం పాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్, సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పి.తేజస్విని పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి!

» పత్తి పంటకు నష్ట పరిహారం లేనట్టేనా?

» 33 శాతం నష్టం దాటలేదన్న అధికారులు

» సగం పంట దెబ్బతిన్నది అంటున్న రైతులు

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

అధిక వర్షాలు, మొంథా తుపాను దెబ్బకు పెద్ద ఎత్తున పత్తి పంటకు నష్టం వాటిల్లింది. ఎన్టీఆర్‌జిల్లాలో మెట్ట ప్రాంతంలోని నందిగామ, జగ్గయ్యపేట, తిరువూరు, మైలవరం నియోజకవర్గాల్లో సుమారు 87 వేలఎకరాల్లో ఖరీఫ్‌లో పత్తిని రైతులు సాగు చేశారు. పంట ఆశాజనకంగా ఉందనుకున్న తరుణంలో అధిక వర్షాలు పత్తికి నష్టం చేశాయి. చెట్ల మీద ఉన్న పింజల్లోని గింజలు మొలకలు వచ్చే వరకు వర్షాలు పడుతూనే ఉన్నాయి. వర్షాలకు చెట్లకు ఉన్న కాయలు నల్లబారిపోయాయి. పక్వానికి రాక గుడ్డి పత్తిగా మారిపోయాయి. మొంథా తుపాన్ ప్రభావంతో వీచిన గాలులకు, వర్షానికి పగిలిన పత్తి కాయల్లో పింజలు నేల రాలిపోయాయి. కింద పడిన పత్తి గింజల్లో నుంచి మొలకలు వచ్చాయి. కనీసం పెట్టుబడి ఖర్చులైనా రాకపోతాయా అని చెట్లకు ఉన్న కొద్దో గొప్పో పత్తిని తీయిస్తున్నారు రైతులు. దెబ్బతిన్న పత్తిని తీయించేందుకు కూలీలు కూడా లభించడం లేదని ఒక వేళ లభించిన కిలోకి రూ.20లు ఇస్తేనే పత్తి తీస్తామంటున్నారని అన్నదాతలు చెబుతున్నారు. ఇంతచేసి పత్తి తీయిస్తే బయట వ్యక్తులు రూ.3,500 నుంచి రూ.4 వేలకు అడుగుతున్నారని అదేమంటే నాణ్యత లేదంటున్నారని అన్నదాతలు వాపోతున్నారు.

శాపంగా మారిన 33 శాతం నష్ట నిబంధన

వాస్తవంగా పంట నష్టం వాటిల్లిన పత్తి రైతులకు 33 శాతం ప్రభుత్వ నిబంధన శాపంగా మారింది. మండల యూనిట్‌గా తీసుకొని 33 శాతంకు పైగా పంట నష్టం వాటిల్లితేనే అధికారులు పంట నష్టం అంచనా వేస్తారు. ఈక్రమంలో ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ఏ మండలంలో 33 శాతం పైగా పత్తి పంట నష్టం జరగలేదని ఆయా మండలాలకు చెందిన వ్యవసాయశాఖ అధికారులు నిర్ధారణకు వచ్చి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్టు విశ్వసనీయంగా తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని ఏ ఒక్క వ్యవసాయాధికారి ధైర్యంగా వెల్లడి చేయలేకపోతున్నారు. కాని వాస్తవానికి 50శాతం పైగానే పంట నష్టం వాటిల్లిందని అన్నదాతలు వాపోతున్నారు. పంట పరిహారం వస్తుందనే ఆశతోనే ఉన్నారు. అధికారులెవరూ దెబ్బతిన్న పత్తి పంటను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయలేదని చెట్లకు ఉన్నకాయలు కాపునకు వస్తాయని అంటున్నారని, అయితే గాలులకు నేలరాలిన పత్తి నాణ్యత కోల్పోయిందని, మొలకలు వచ్చి పత్తి బరువులేకుండా పోయిందని, కూలీల ఖర్చులు పెరిగిపోయాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

అధిక వర్షాలకు తోడు తుపాను ప్రభావంతో వర్షాలకు పత్తి దిగుబడులపై తీవ్ర ప్రభావం పడింది. సాధారణ రోజుల్లో ఎకరానికి 13 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. ఇప్పుడు సగానికి సగం తగ్గిపోతుందని అన్నదాతలు అంటున్నారు. కొన్నిచేలల్లో అయితే కేవలం 5 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని బాధిత రైతులంటున్నారు.

సీసీఐ ద్వారా ప్రభుత్వమే కొనాలి

- బజ్జిల్లా, జి.కొండూరు

నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల ఎ.కొండూరు, మైలవరంలలో తక్షణమే సీసీఐ కొనుగోలు కేంద్రాలు తెరవాలి. నాణ్యత, తేమ శాతంతో సంబంధం లేకుండా క్వింటాకు రూ.8 వేలు ఇచ్చి కొనుగోలు చేయాలి. ప్రైవేటు వ్యాపారుల నుంచి ప్రభుత్వమే రైతులను కాపాడాలి.



క్షేత్రస్థాయి పరిశీలన లేదు

- కడియాల వెంకటేశ్వరరావు, జి.కొండూరు

వర్షాల వల్ల పత్తికి తీవ్ర నష్టం జరిగిన మాట వాస్తవం. 50 ఎకరాల్లో పత్తి సాగు చేశా. ఒక్క అధికారి కూడా పొలంలోకి రాలేదు. నష్టం లేదని ఎలా తేలుస్తారు. సాగు చేసిన పత్తి ఎంత, వచ్చిన దిగుబడి ఎంత అనే అంశాన్ని అయినా పరిగణలోకి తీసుకొని నష్టం జరిగిందో లేదో పరిశీలించాలి.



రాలిన పింజల్లోని పత్తి గింజల్లో వచ్చిన మొలకలు

మూడు చోట్ల సీసీఐ కేంద్రాలు

జిల్లాలో జగ్గయ్యపేట జిన్నింగ్‌లో, నందిగామ, కంచికచర్లలోని మార్కెట్ యార్డ్‌లో సీసీఐ కేంద్రాలు తెరిచారు. కొద్ది రోజుల్లో మైలవరం, ఎ.కొండూరుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. మైలవరం ఏఎంసీలో జిన్నింగ్ మిల్ ప్రారంభించారు. నేరుగా జిన్నింగ్ మిల్‌కు వెళ్లి పత్తి విక్రయించుకోలేని రైతులు వారి పత్తిని మైలవరం ఏఎంసీ నుంచే విక్రయించుకోవచ్చని అధికారులు తెలిపారు. మూడు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు ఎలాంటి కొనుగోళ్లు జరగలేదు. పత్తి 8 శాతం తేమ ఉంటే క్వింటాకు రూ.8,110లు మద్దతు ధరగా నిర్ణయించారు. రైతులు విధిగా వారి పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని అధికారులు కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600

ప్రాంతీయ భాషల్లో కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అభివృద్ధి చేయాలి

కానూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రాంతీయ భాషల్లో కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సల్మాన్ అబ్దుల్ మొయిజ్ చెప్పారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో హ్యాక్ ప్రమాణం ఉన్న కృత్రిమ మేధస్సు.. ఏ1 వ్యవస్థల కోసం సైబర్ భద్రత అనే అంశంపై మూడు రోజుల పాటు జరిగే వర్క్‌షాప్ సోమవారం ప్రారంభమయింది. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ మొయిజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగిస్తూ సైన్స్ లాంగ్వేజ్‌ను ప్రాంతీయ భాషలకు అనువదించగల ఎస్ఎల్‌పీ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో వర్సిటీ ప్రో.వీసీ ఏపీ రత్నప్రసాద్, డీన్ డాక్టర్ డి. వెంకట్రావు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎం. సునీత, కోఆర్డినేటర్‌లు డాక్టర్ కె. సీతాకుమారి, డాక్టర్ టి. అనూరాధ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

కలెక్టర్ డీకే బాలాజీ

గన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలసి అకస్మికంగా పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణం లోని పరిశుభ్రత, రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మందులు అందుబాటులో ఉన్నాయ లేవా అని తెలుసుకున్నారు. ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, ప్రజలకు ఉత్తమ వైద్య సేవలు అందించటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందరు సమిష్టిగా రోగులకు సేవలందించాలన్నారు.


వైద్యసేవలపై ఆరా తీస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రైతులను ఆదుకోవాలి

మొంథా తుఫాన్ వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బృందానికి వినతిపత్రం అందజేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించేందుకు వచ్చిన కేంద్ర బృందానికి కౌలు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ లక్ష్మణ స్వామి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేసి సమస్యలను వివరించారు. వరిపొట్ట దశలో వచ్చి ఈదురు గాలులకు నేలకు ఒరిగి పొట్ట పగిలి ప్పలుగాను మడంతాలు, మాను గాయితో పంట నష్టం బాగా వాటిల్లిందన్నారు. వరి పడిపోయిన, నిలబడి ఉన్న గాలులకు పొట్టలు పగిలి కప్పలుగా మారాయన్నారు. దిగుబడి కూడా బాగా తగ్గుతుందని, నిబంధనలు సడలించి రైతులను ఆదుకోవాలన్నారు. అజ్మీర్ వెంకటేశ్వరరావు, ఎం.సాంబశివరావు, భీమవరపు సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధి చేపడతామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని మారేడుమాకలో రూ. 10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సుమారు 90శాతం మేరకు రహ దారులు అభివృద్ధి పూర్తి చేయడం జరిగిం దన్నారు. అదే విధంగా డ్రైనేజీ నిర్మాణ పనులను కూడా త్వరితగతిని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, సర్పంచ్ ఆదర్శ్, స్థానిక టీడీపీ నాయకులు వీరబాబు, బాలకోటి, లాం సురేష్ తదితరులు పాల్గొన్నారు.


మారేడుమాకలో డ్రెయినేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కమ్యూనిటీ హాల్ కేటాయించాలి

మండలంలోని పునాదిపాడు జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు సోమవారం ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సుమారు 400 కుటుంబాలు నివాసముంటున్న కాలనీలో తమకు కమ్యూనిటీ హాల్ లేకపో వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తమకు కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పునాదిపాడులో గ్రామంలో బాలికల వసతి గృహం గత అనేక సంవత్సరాలుగా ఖాళీగా నిరుపయోగంగా ఉందని ఆ భవనాన్ని తమకు కమ్యూనిటీ హాల్‌గా మార్చి ఇవ్వాలని స్థానికులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో మాట్లాడి నిరుపయోగంగా ఉన్న బాలికల వసతి గృహాన్ని తమకు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కర్రా కిషోర్‌బాబు, నాగ అనీల్ కుమార్, అరవింద్, జంపని భాస్కరరావు, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన కట్టడాలు కూల్చివేస్తాం

పెనమలూరు : తాడిగడప మునిసిపాలిటీలోని కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు క్లస్టర్లలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన కట్టడాలలో ఎటువంటి డీవియేషన్స్ ఉన్నా మునిసిపల్ సిబ్బంది కూల్చివేస్తారని మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్ సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈ సంవత్సరం ఆగస్టు 31 తర్వాత నిర్మించిన కట్టడాల విషయంలో ఈ నిబంధన వర్తిస్తుందని తెలిపారు. అక్రమ కట్టడాలను ఎటువంటి ముందస్తు నోటీసులు, హెచ్చరికలు లేకుండానే కూల్చివేస్తారని తెలిపారు. ● **ఉయ్యూరు :** ఉయ్యూరు పురపాలక సంఘం పరిధిలో 31-8-2025 తరువాత ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏవిధమైన నిర్మాణాలు చేపట్టినా వాటిని కూల్చివేస్తామని పురపాలక సంఘం కమిషనర్ జె.రామారావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఏవిధమైన నిర్మాణాలు, చేపట్టరాదని చట్ట విరుద్ధంగా నిర్మాణాలకు పాల్పడినట్టు గుర్తించిన యెడల వారిపై 2025 యాక్టు ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా నవగ్రహ విగ్రహాల ప్రతిష్ఠ

హనుమాన్‌జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక బాపులపాడు శ్రీ భ్రమరాంబ సమేత శ్రీశైల బ్రహ్మసూత్ర మరకత మల్లికార్జునస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నవ గ్రహ విగ్రహాలతో పాటు, విజయ గణపతి, శేష భగవాన్ విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ గూడవల్లి చిన్నా పర్యవేక్షణలో వేద పండితులు కోసూరి మురళీ కృష్ణమాచార్యులు, బుచ్చి రామశర్మ, ఆలయ అర్చకులు సామవేదం మారుతి శర్మలు ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో 5వేల మందికి అన్నసంతర్పణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. సభ్యులు తమిరి రమేష్, కొల్లి వెంకట్రావు, వీరమాచనేని నాగయ్య, రాంబాబు తదితరులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.


వైద్య శిబిర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగసాయి మధుసూదనరావు

దంతాల సంరక్షణతోనే మంచి ఆరోగ్యం

● **కళాశాల కన్వీనర్ నాగసాయి మధుసూదనరావు**

గన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దంతాల సంరక్షణతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని కళాశాల కన్వీనర్ పాలడుగు నాగసాయి మధుసూదనరావు అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలల్లో ఈ నెల 17 నుంచి డిసెంబరు 6వ తేదీ వరకూ దంత వైద్య సేవలను ప్రారంభించే పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగసాయి మధుసూదనరావు మాట్లాడుతూ, సిద్ధార్థ అకాడమి స్వర్ణోత్సవం సందర్భంగా ఉచిత సేవలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల సిమెంట్ ఫిల్లింగ్స్, శస్త్ర చికిత్సలు తీసి పెట్టుకు నే పళ్ళ సెట్లు, ఎక్స్‌రేలు, రక్త పరీక్షలు పళ్ల క్లీనింగ్, చిన్న పిల్లల దంత వైద్య సేవలన్ని ఉచితంగా చేస్తారని చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి రామోజీ రావు మాట్లాడుతూ, రూట్ కెనాల్ చికిత్సలు, ఎత్తు, వంకర పళ్ల సరి చేయ టం, ఫిక్సిడ్ పళ్లు, క్యాప్‌లపై 50 శాతం రాయితీ ఉంటుందన్నారు. ఈ అవ కాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏవో వై.మధు సూదనరావు, హెచ్‌వోడీలు అన్నే కాశేశ్వరరావు, అజయ్ బెనర్జీ, సురేష్, రాంబాబు, జీఎం నాయుడు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ తొలగించాలని సీపీఎం ధర్నా

ఉంగుటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తేలప్రోలులోని డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తొలగించాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో గ్రామస్థులు సోమవారం స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ వలన చెత్తకుళ్లిపోయి దుర్వాసన వెలువడుతుండటం, అప్పుడప్పుడు చెత్త తగలబెట్టడంతో వెలువడే పొగతో స్థానిక ప్రజలు అనారోగ్యసమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని సచివాలయ సెక్రటరీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాగంటి సాంబశివరావు, భీమవరపు సుబ్బారెడ్డి, రహమాన్, ఐటీఐ కళాశాల సిబ్బంది సీహెచ్ వెంకటేశ్వరరావు, దాస్‌బాబు, సంపత్‌కుమార్, గ్రామస్థులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా
ధాన్యం కొనుగోలు చేయాలి: ఏఎంసీ ఛైర్మన్

గన్నవరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని ఏఎంసీ ఛైర్మన్ గూడవల్లి నరసింహారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నాలుగు మండలాల ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహారావు మాట్లాడుతూ రైతులకు సరిపడా గోనె సంచులను ముందుగానే అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేల కొనుగోలు క్రేంద్రాల సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులంతా అప్రమత్తంతో ఉండాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎస్.పద్మావతి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కొండేటి వెంకటేశ్వరావు, ఏడీఏ ఎం.సునీల్, పీడీఎస్ డీటీ అంకాలు, ఏఎంసీ సెక్రటరీ ఎ.కిషోర్ పాల్గొన్నారు.

పీవీ సిద్ధార్థలో మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం

కానూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కానూరులోని పీవీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు జరిగే మేనేజ్ మెంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం సోమవారం ప్రారంభమయింది. ఈ సందర్భంగా అతిథిగా పాల్గొని సీటీఐడీ సబ్‌సెంటర్ శిక్షణా నిపుణుడు పి. చంద్రశేఖర్ ప్రసంగిస్తూ ఒక వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలి, సమస్యలను ఎలా పరిష్కరించాలి, మంచి నాయకునిగా ఎలా ఎదగాలి, తమ ఆలోచనలను విద్యార్థులు కార్యరూపం దాల్చాలంటే ఎటువంటి మార్గాలు చేపట్టాలో ఆయన వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొండపల్లి శివాజీ బాబు, విభాగాధిపతి డాక్టర్ పి. ఆదిలక్ష్మి, నిపుణుడు జి. శివన్నారాయణతోపాటు పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆముదాలపల్లిలో టీడీపీ కార్యకర్త కుటుంబానికి బడ్డీకొట్టును అందజేస్తున్న పీఆర్కే ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ

ఆర్థికసాయం అభినందనీయం

ఉంగుటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో జీవనోపాధి కష్టంగా మారిన టీడీపీ కార్యకర్తలకు పీఆర్కే ఫౌండేషన్ ఆర్థికసాయం మందించి అండగా నిలవడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు అన్నారు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఆముదాలపల్లికి చెందిన టీడీపీ కార్యకర్త రేపల్లి వెంకటేశ్వరరావుకు పీఆర్‌కే ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ బడ్డీకొట్టును సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా పీఆర్కే ఫౌండేషన్ అధినేత పారా రామకృష్ణ మాట్లాడుతూ పీ4కార్యక్రమం ద్వారా పేదలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్న సీఎం చంద్రబాబును స్ఫూర్తిగా తీసుకుని గన్నవరం నియోజకవర్గంలో పీఆర్కే ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను మరింత విస్తృత పరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తా అనిల్ బాబు, దాసరి వెంకటరంగారావు, వెంకటరత్నం, సీతారామయ్య, బీజేపీ నాయకులు నిడమర్తి నాగేశ్వరరావు, సౌజన్య పాల్గొన్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పురస్కరించుకొని స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపం, వాసవీమాత ఆలయంలో కోటి దీపోత్సవం వేడుక సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బాపులపాడు మండల ఆర్యవైశ్య సంఘం, వాసవీ మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన దీపోత్సవంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయ ప్రాంగణంలో లక్ష దీపాలు వెలిగించడంతో పాటు కోటి వత్తులను కలిపి అఖండ జ్యోతిగా వెలిగించారు. ఆర్యవైశ్య నేతలు బొమ్మిశెట్టి రామారావు, గార్లపాటి రామకృష్ణ, నారికమల్లి ప్రసాద్, వెత్సా వెంకటేశ్వరరావు తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్: పెరికీడు ముక్తేశ్వరస్వామికి అభిషేక పూజలు కార్తీక సోమవారం నిర్వహించారు. అర్చకులు శ్యామ్, మహేష్ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకంగా పూలతో అలంకరణ నిర్వహించారు. తదనంతరం భక్తుల దర్శనానికి అనుమతిచ్చారు. మడిచర్లలోని మల్లికార్జునస్వామి, సింగన్నగూడెంలోని సోమేశ్వరస్వామి, వీరవల్లిలో కొండేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు.

ఉయ్యూరు : కార్తీకమాస సోమవారం పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుంచి భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణాల్లో దీపారాధన చేసి పూజలు చేశారు. కుటుంబ సభ్యులతో కలసి వచ్చి ఉదయం, సా యంత్రం దీపారాధన చేసి పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.


జంక్షన్ వాసవీ మాత ఆలయంలో కోటి దీపోత్సవం

అటెన్షన్..!

పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్‌లో భద్రత ప్రశ్నార్థకం !!





- ఒకటి ఆసియాలోనే ఘనం.. రెండోది దేశంలోనే ఘనం
- సీసీ కెమెరాలున్నా.. భద్రతా వ్యవస్థ బలంగా లేదు
- ప్రయాణికులను తనిఖీలు చేసే వ్యవస్థలు లేవు.
- లగేజీ స్కానర్స్ తప్పనిసరి.. కనీసం మార్గాల్లో మెటల్ డిటెక్టర్స్ లేవు
- బెజవాడ నగరానికి ముష్కరులు వస్తే ఈ రెండింటి ద్వారానే రావాలి !
- ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో భద్రతపై అటెన్షన్ అవసరం

> ఆసియాలోనే రెండో అతి పెద్ద బస్ స్టేషన్ (పీఎన్‌బీఎస్), దేశంలోనే రెండో అతి పెద్ద రైల్వే జంక్షన్ .. మన బెజవాడలోనే ఉన్నాయి. ఇటు బస్ స్టేషన్, అటు రైల్వేస్టేషన్‌కు కలిపి రోజుకు 4 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యంత రద్దీగా ఉండే ఈ రెండింటి భద్రత ప్రశ్నార్థకంగా ఉంది.
> - ఆంధ్రజ్యోతి, విజయవాడ

పీఎన్‌బీఎస్‌లో భద్రతాపరంగా ఎలాంటి ఏర్పాట్లు లేవు. బస్‌స్టేషన్‌కు అన్ని వైపులా దారులే ఉన్నాయి. ఎటు నుంచి ఎవరైనా స్వేచ్ఛగా రాకపోకలు సాగించవచ్చు. సీసీ కెమెరాలున్నా నిఘా వ్యవస్థ పటిష్ఠంగా లేదు. బస్ స్టేషన్‌కు గతంలో ఆర్టీసీ సెక్యూరిటీ వ్యవస్థను ఏర్పాటు చేసేది. ప్రస్తుతం ఎత్తివేశారు. సెక్యూరిటీ లేకుండా ఆసియాలోనే అతిపెద్ద బస్‌స్టేషన్ నిర్వహణ సాగుతుందంటే ఎలాంటి లోపాలున్నాయో అర్థం చేసుకోవాలి. కృష్ణలంక పోలీసులు కొద్ది మంది విధులు నిర్వహించటం తప్పితే బస్ స్టేషన్‌లో తనిఖీలు లేవు. బస్ స్టేషన్‌కు సిటీ బస్ టెర్మినల్ వైపు నుంచి మూడు మార్గాల్లో లోపలికి చేరుకోవచ్చు. ఇన్‌గేట్, అవుట్ గేట్, మిడిల్ గేట్ నుంచి, రైల్వే మెయిన్ లైన్ వెపు నుంచి కూడా బస్‌స్టేషన్‌లోకి చేరుకోవటానికి మార్గాలున్నాయి. అపరిచితులు ఎటు నుంచి ఎటైనా కన్నుగప్పి బస్‌స్టేషన్‌లోకి రావటానికి అవకాశం ఉంది. ఎంట్రీ పాయింట్లలో భద్రతా ఏర్పాట్లు లేవు. కనీసం మెటల్ డిటెక్టర్స్ వంటివి కూడా లేవు. ప్రయాణికుల ముసుగులో ఎవరు వస్తున్నారో? ఎవరు వెళుతున్నారో తెలియదు! ప్రతిరోజూ 2 లక్షల మంది ప్రయాణికులు వస్తుంటారు. నిమషానికి 2 బస్సులు వస్తూ పోతుంటాయి. ఇంత రద్దీగా ఉన్న బస్‌స్టేషన్‌లో ఢిల్లీ వంటి ప్రమాదాలు జరగకుండా నివారించే వ్యవస్థలు లేవు. ముష్కరులు అమాయకుల ప్రాణాలనే లక్ష్యంగా చేసుకుంటారు. దేశంపై దాడి చేయటానికి ఇంతకంటే మార్గం ఉండదు. విజయవాడ రైల్వేస్టేషన్‌లోనూ దాదాపు ఇదే పరిస్థితి. రైల్వేస్టేషన్ ప్రాంగణం చుట్టూ బ్లేడ్‌బ్యాచ్, సంఘ విద్రోహశక్తుల ఆగడాలు అన్నీ, ఇన్నీ కావు. రైల్వే స్టేషన్‌లోనే బ్లేడ్‌బ్యాచ్‌ను నివారించలేని పరిస్థితి. జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్, రైల్వే పోలీసులు ఎవరూ బ్లేడ్‌బ్యాచ్‌ను నియంత్రించలేకపోతున్నారు. దీంతో వారు ఆగి ఉన్న బోగీలను తగులబెట్టే స్థాయికి ఎదిగారు. రైల్వేస్టేషన్ పరిధిలో ఇటీవల ఈసంఘటన చోటు చేసుకుంది. వీరినే నియంత్రించలేకపోతే ప్రాణాంతక ముష్కరులను ఎలా ఎదుర్కొంటారన్నది ప్రశ్నార్థకం. రైళ్లలో ప్రయాణించటానికి భారీ సంఖ్యలో వచ్చే ప్రయాణికుల భద్రత విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటారన్నది ఆలోచించాల్సిన విషయం. రైల్వేయార్డులో ఇనుము దొంగతనం జరుగుతుటేనే ఎవరు ఈ పనులు చేస్తున్నారో త్వరగా తెలుసుకోలేని పరిస్థితుల్లో రైల్వే వ్యవస్థ ఉంది. రైల్వేస్టేషన్‌లోనూ మెటల్ డిటెక్టర్ల వ్యవస్థ లేదు. లగేజీ స్క్రీనింగ్ యంత్రాలు మచ్చుకు కూడా లేవు. అటు బస్‌స్టేషన్, ఇటు రైల్వేస్టేషన్‌లో వేళ్లూనుకున్న లోపాలతో ప్రయాణికుల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. నగరంలోకి ముష్కరులు ప్రవేశించటానికి ప్రధాన మార్గాలుగా ఉన్న బస్‌స్టేషన్, రైల్వే స్టేషన్లలో భద్రతా ప్రమాణాల పెంపు దిశగా చర్యలు చేపట్టకపోతే తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంటుంది.

విజయవాడ రీజియన్ పోస్ట్‌మాస్టర్ జనరల్ పదోన్నతిపై బదిలీ

గాంధీనగర్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డీఎస్‌వీఆర్ మూర్తి జమ్మూకశ్మీర్ సర్కిల్ సీపీఎంజీ పదోన్నతిపై నియమితులయ్యారు. ఈ సందర్భంగా గాంధీనగర్‌లోని కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన సేవలను ప్రశంసించారు. 2022 నుంచి పీఎంజీ విజయవాడ రీజియన్‌గా వివిధ కేటగిరిల్లో విజయవాడ రీజియన్ సాధించిన విజయాలను, ఆయన నాయకత్వాన్ని అధికారులు, సిబ్బంది ప్రశంసించారు. పోస్టాఫీస్ భవనాల పునఃరుద్ధరణ, యర్రగొండపాలెం, చిలకలూరిపేట, సత్తెనపల్లి ప్రాంతాల్లో కొత్త భవనాల నిర్మాణానికి మంత్రి వర్గ స్థాయి నుంచి ప్రత్యేక నిధుల కేటాయింపుల్లో ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన పని చేసిన మూడేళ్లలో విజయవాడ రీజియన్, పాన్ ఇండియా స్థాయిలో పోస్టల్ ఇన్సూరెన్స్, పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్, ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్, పాస్‌పోర్ట్ సేవా కేంద్రాలు వివిధ కేటగిరిల్లో మెరుగైన పని తీరు ప్రదర్శించి అనేక అవార్డులు సాధించడం జరిగిందన్నారు.



కేక్ కట్‌చేసి ఆటో కార్మికుడికి తినిపిస్తున్న ఎమ్మెల్యే గద్దె

ఆటో డ్రైవర్లకు అండగా ఉంటా

- ఆటోస్టాండ్ 11వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సమస్యలను తన స్థాయిలో పరిష్కరిస్తూనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకొనేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. సోమవారం కనకదుర్గమ్మ వారధి వద్ద ఉన్న ఆటో స్టాండ్ 11వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు గద్దె రామ్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ విజయవాడకు మంచిపేరు తీసుకువచ్చేది ఆటో డ్రైవర్లేనన్నారు. వివిధ ప్రాంతాల నుంచి పనులపై నగరానికి వచ్చిన వారిని వారి గమ్యస్థానాలకు సురక్షితంగా తీసుకెళ్లేది వారేనన్నారు. ఆటో డ్రైవర్లకు తాను అధిక ప్రాధాన్యత ఇచ్చి అండగా ఉంటున్నానన్నారు. ఆటో డ్రైవర్ల సమస్యలతో పాటు ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం పథకంతో వారికి కలిగే నష్టాలను కూటమి ప్రభుత్వం భర్తీ చేస్తూ ఏడాదికి రూ.15వేలు అందచేస్తోందన్నారు. రాయవరపు అశోక్, మొకర ఆదిబాబు, మోటేపల్లి చిన్నా, ముని కృష్ణ, వేముల శ్రీను, ఆదాం, చిన్నా, శ్రీను, రాయవరపు కల్యాణ్ పాల్గొన్నారు.




ఎస్టీయూ జిల్లా సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

జగ్గయ్యపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ సాయిశ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం రాత్రి పట్టణంలో ఉక్కు కళా వేదికలో జరిగిన 79వ జిల్లా కౌన్సిల్ సమావేశాల్లో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. టెట్ నుంచి మినహాయింపు కోరుతూ తమ యూనియన్ ఇప్పటికే సుప్రీంలో రివ్యూ పిటి షన్ వేసిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే రివ్యూ పిటిషన్స్ వేయాలని కోరారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలని, వారి స్థానంలో 1998 క్వాలిఫైడ్ టీచర్లను లేదా అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిం చాలని సూచించారు. ఖాళీ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. ఓపీఎస్ అములుపై ప్రభుత్వ నిర్ణయం ప్రకటించాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ ఇవ్వాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు వేముల బిక్షమయ్య అధ్యక్షతన సమావేశం జరగ్గా, పలువురు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి బాధ్యులు పాల్గొని ప్రసంగించారు.



ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో అనుమోలు పేరు

- అధికారికంగా ప్రకటించిన సంస్థ

పెనమలూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 5642 మీ టర్ల ఎత్తయిన ఎల్బ్రస్ పర్వతాన్ని అధిరోహించిన వయోజ్ఞుడిగా పేరొందిన పోరంకి వాస్తవ్యుడు, టీడీపీ సీనియర్ నేత అనుమోలు ప్రభాకరరావు పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సు అధికారికంగా నమోదు చేసింది. సదరు వివరాలను యాజమాన్యం అధికారికంగా సోమవారం అనుమోలుకు తెలిపింది. గతంలో ఆయన ఎవరెస్టు, బేస్ క్యాంపును, కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి ప్రపంచాన్ని ఆశ్చర్యానికి గురిచేశారు. ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించిన అనుమోలును ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ కూటమి నేతలు, శ్రేయోభిలాషులు అభినందించారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

అర్జీల పరిష్కారంలో నాణ్యత పెరగాలి

- కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంలో నాణ్యత పెరగాలని, మరింత మెరుగైన, సంతృప్తికరమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఇలక్కియాతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో విధానపరమైన లోపాలు (ప్రొసీజర్ లాప్సెస్) లేకుండా చూడాలన్నారు. అర్జీల పరిష్కారం సరిగా నిర్వహించని అధికారులపై చర్యలకు వెనుకాడబోనన్నారు. ఫిర్యాదుల ఆడిటింగ్‌ను నిక్కచ్చిగా చేయాలన్నారు. కీలక ప్రగతి సూచికల (కేపీఐ), నియోజకవర్గ విజన్ కార్యాచరణ ప్రణాళిక లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలన్నారు. డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మార్గదర్శకాలకు అనుగుణంగా దత్తత

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సూచనలకు అనుగుణంగా ఈ ఏడాది నవంబరులో దత్తతకు సంబంధించిన అవగాహన సదస్సులు జరుగుతున్నాయని, ప్రభుత్వాల మార్గదర్శకాలను అనుసరించి చట్టబద్ధంగా దత్తత తీసుకోవడం ఒక వరమని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు.

సోమవారం ఆయన జాయింట్ కలెక్ట ర్ ఇలక్కియా, అధికారులతో కలిసి సమావేశ మందిరంలో దత్తత అవగాహన పోస్టర్లను ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దత్తతకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ దళారీలను నమ్మవద్దని, చట్టపరంగా దత్తత తీసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఎవరైనా పిల్లలను దత్తత తీసుకోవాలనుకుంటే సమగ్ర బాలల సంరక్షణ పథకం, జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖను సంప్రదించాలన్నారు. ప్రత్యేక అవసరాలున్న చిన్నారుల దత్తత ఇతివృత్తంతో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. జిల్లా పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, డీఆర్‌వో ఎం లక్ష్మీ నరసింహం, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, డీసీపీవో రాజేశ్వరరావు, జాన్సన్ పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గించి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి

- హోటల్ రంగంపై విద్యుత్ చార్జీల భారం తగ్గించాలి
- కేంద్ర సాయంపై సీఎం చొరవ చూపాలి
- అన్న క్యాంటీన్‌కు ఆషా రూ.50 లక్షల విరాళం
- ఆషా అధ్యక్షుడు ఆర్వీ స్వామి

విజయవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ ధరలు 12 నుంచి 5 శాతానికి తగ్గించి ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ (ఆషా) అధ్యక్షుడు ఆర్వీ స్వామి విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఏపీ స్టార్ హోటల్స్ అసోసియేషన్ మొదటి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి ప్రభుత్వం సహకారం అందిస్తుందని, అమరావతిలోనూ అనేక హోటళ్ల నిర్మాణం కోసం భూమి పూజ జరిగాయన్నారు. హోటల్ రంగానికి విద్యుత్ బిల్లుల భారం ఎక్కువగా ఉందని, ఇతర రాష్ట్రాల కన్నా ఎక్కువ ధరలు వసూలు చేస్తున్నారని ఈ అంశాల్లో రాయితీ ఇచ్చి ధరలు తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలో సీఎం చంద్రబాబుకు ప్రత్యేక గౌరవముందని హోటల్ రంగానికి కేంద్రం నుంచి సహకారం అందించేలా సీఎం మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ పన్నుల్లో 50శాతం సబ్సిడీ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అన్న క్యాంటీన్ ట్రస్ట్‌కు ఆషా తరఫున రూ.50 లక్షలు విరాళం ఈ నెల 14, 15న విశాఖపట్నంలో జరిగే సమ్మిట్‌లో సీఎం చంద్రబాబుకు ఇస్తామన్నారు. ఆషా జనరల్ సెక్రటరీ చిట్టూరి మూర్తి మాట్లాడుతూ కొత్త హోటళ్లకు ఐటీసీని తిరస్కరించడం వల్ల ప్రాజెక్టు ఖర్చు 15-18 శాతం పెరిగిందన్నారు. దీంతో హోటల్ రంగంపై రూ.కోట్ల భారం పడుతోందన్నారు. రాష్ట్రంలో హోటళ్లకు అదనపు చార్జీలను పరిగణలోకి తీసుకున్న తర్వాత యూనిట్‌కు రూ. 12-13 వరకు బిల్లు వస్తోందన్నారు. పారిశ్రామిక వినియోగదారులకు రూ.5.50-6 యూనిట్‌కు చెల్లిస్తున్నారని, అన్ని చార్జీలు కలిపితే యూనిట్‌కు రూ.10-11 బిల్లు వస్తోందన్నారు. పక్క రాష్ట్రాల్లో విద్యుత్ చార్జీలు తక్కువగా ఉన్నాయని, అక్కడ పరిశీలించిన తర్వాతైనా విద్యుత్ చార్జీల భారాలు తగ్గించాలని కోరారు. హోటల్స్ అభివృద్ధి ద్వారా పర్యాటక ప్రదేశాలు పెరుగుతాయని మూర్తి పేర్కొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఆషా అధ్యక్షుడు ఆర్వీ స్వామి, హోటల్స్ యజమానులు

చరిత్రకు సాక్ష్యం.. కృష్ణా ప్యాలెస్ !!

తెలుసుకుందాం..!

ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీ: విజయవాడ నగరంలో ప్రస్తుతం కృష్ణానదిపై రెండు రోడ్డు రవాణా (ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గా వారధి) మార్గాలు, రెండు రైల్వే మార్గాలు (తూర్పు రైల్వే ట్రాక్, పశ్చిమ రైల్వే ట్రాక్) ఉన్నాయి. అయితే స్వాతంత్ర్యానికి పూర్వం ఒకే ఒక రైల్వే లైన్ ఉండేది. అప్పట్లో ప్రస్తుతం ప్రకాశం బ్యారేజీ ఉన్న ప్రదేశంలోనే నదిలో కాజ్‌వే (నదీ పరివాహక ప్రాంతంలో రోడ్డు) ఉండేది. ఈ మార్గం ద్వారా మంగళగిరి నుంచి బస్సులు విజయవాడకు వచ్చేవి. కృష్ణానదికి వరద వచ్చినపుడు ఆ రోడ్డు పూర్తిగా మునిగిపోయేది. అలాంటి సందర్భాల్లో ప్రజలు నది దాటడానికి ఉన్న మరో మార్గమే పాత రైల్వే లైన్. కృష్ణా ప్యాలెస్‌గా నామకరణం చేయబడిన ఈ రైల్వే ట్రాక్ ఓ అద్భుత కట్టడంగా నిలిచింది. 1893లో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం నిర్మాణం చేసింది. తూర్పున మచిలీపట్నం నుంచి పశ్చిమాన గోవాకు సరుకు తరలించేందుకు ఏర్పాటు చేశారు. ఈ వంతెనపై కింద ట్రాక్‌పై రైలు వెళ్లేలా, పైన మనుషులు నడిచేలా రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కృష్ణానదికి వరద వచ్చి, ప్రకాశం బ్యారేజీ ప్రాంతంలోని కాజ్‌వేపై నీరు ప్రవహించే రోజుల్లో తాడేపల్లి నుంచి ప్రజలు 11 పెద్దపెద్ద పిల్లర్లపై ఏర్పాటు చేసిన ఈ రైల్వే పై వంతెన ద్వారానే వన్‌టౌన్ మార్కెట్‌కు చేరుకునేవారు. పై వంతెన మీదుగా నడుచుకుంటూ వచ్చిన ప్రజలు దిగేందుకు ఇదే ట్రాక్‌నకు ఇరువైపులా దీపపు బుడ్డి ఆకారంలో రెండు కట్టడాలను నిర్మించారు. వీటిలోని మెట్ల మార్గం ద్వారా అప్పట్లో ప్రజలు కిందకు చేరుకునేవారు. స్వాతంత్ర్య తరువాత మన పాలకులు అదే ప్రాంతంలో ఈ రైల్వే లైన్‌కు తూర్పున ఒకటి, పశ్చిమాన మరోకటి కొత్త ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. దీంతో ఈ పాత ట్రాక్‌ను 1961లో తొలగించారు. కృష్ణానదిపై ఉన్న పాత ట్రాక్‌ను పూర్తిగా తొలగించారు. ఇదే లైన్‌లో జాతీయ రహదారి 65 పై ఉన్న పాత రైల్వే లైన్ ఓవర్ బ్రిడ్జిని మాత్రం అలానే ఉంచారు. ప్రస్తుతం ఈ ఓవర్ బ్రిడ్జిపై రైల్వే అధికారులు పెద్దపెద్ద తాగునీటి పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. పాత రైల్వే లైన్‌కు గుర్తుగా నదిలో నేటికీ భారీ పిల్లర్లు కనిపిస్తుంటాయి. నది ఒడ్డున విజయవాడ వైపున దీపపు బుడ్డీ ఆకారంలో రెండు కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. మెట్ల మార్గం ద్వారా వీటి పైకి చేరుకుంటే కృష్ణాదిపై ఉన్న రెండు కొత్త రైల్వే ట్రాక్‌లు, ప్రకాశం బ్యారేజీ, కనకదుర్గ వారధి, దుర్గమ్మ కొలువైన ఇంద్రకీలాద్రి స్పష్టంగా చూడొచ్చు. రైల్వే అధికారుల కాస్త చొరవ చూపితే నగరంలో ఇదో పర్యాటక కేంద్రంగా రూపాంతరం చెంది ప్రజలకు మధురానుభూతిని పంచుతుంది.



1893లో బ్రిటీష్‌వాళ్లు నిర్మించిన రైల్వే ట్రాక్



దీపపు బుడ్డీ ఆకారంలో కట్టడాలు

కారుణ్య మరణానికి అనుమతి ఎలా కోరతారు..?

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌పై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ, ఆమె కుమార్తె వెంకాయమ్మ, మనువరాలు శ్యామల తరఫు న్యాయవాది రిట్ పిటిషన్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించగా.. ఆ తరహా అభ్యర్థనను కోర్టు అనుమతించదని తెలిసి ఇలాంటి ప్లీడింగ్స్ ఎలా కోరతారని ప్రశ్నించింది. ఒకవేళ పిటిషనర్లు ఒత్తిడి చేసి ఉంటే వ్యాజ్యం దాఖలుకు నిరాకరించి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. ప్రచారం కోసం న్యాయస్థానాలను వేదికగా చేసుకోవద్దని హెచ్చరించింది. రిట్ పిటిషనలో అభ్యర్థనను సవరించాలని ఆదేశించింది. శేషగిరమ్మ మనువరాలు శ్యామల మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని, పిటిషన్‌లో ఏముందో తెలియపర్చకుండా ఆమె నుంచి వకాలత్‌పై సంతకం ఎలా తీసుకున్నారని నిలదీసింది. పిటిషనర్లు ప్రస్తుత నివాసం నుంచి పక్కకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదని చెబుతున్న నేపథ్యంలో ఆ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం పిటిషనర్ల నివాసం ఎక్కడ ఉంది..? అక్కడ ఏమైనా ప్రాజెక్టులు రాబోతున్నాయా..? సీఆర్‌డీఏ చేపట్టే నిర్మాణాలకు ఆ ఇళ్లు ఏమైనా అడ్డంకిగా ఉన్నాయా..? తదితర వివరాలను తమ ముందుంచాలని సీఆర్‌డీఏ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఐదు సెంట్లు పొరపాటున ఇచ్చాం..

రాయపూడి గ్రామం పరిధిలో తమకున్న 5 సెంట్ల ఇంటి స్థలాన్ని నిరక్షరాస్యత కారణంగా పొరపాటున ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకు అప్పగించామని, దాన్ని తిరిగి తమకు అప్పగించేలా సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించాలని కోరుతూ రాయపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, చెరుకూరి వెంకాయమ్మ, మనవరాలు చెరుకూరి శ్యామల హైకోర్టును ఆశ్రయించారు. తాము నివాసం ఉండేందుకు ఆ స్థలం తప్ప మరొకటి లేదని, తిరిగివ్వడం వీలుకాకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం... పిటిషనర్ల స్థితిగతులను పరిశీలించి వివరాలు సమర్పించాలని న్యాయవాది రూపేశ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు రాగా న్యాయవాది రూపేశ్ కుమార్ స్పందిస్తూ... మానసిక వైకల్యంతో బాధపడుతున్న శ్యామలతో నేరుగా మాట్లాడాను.. తాను అడిగిన ప్రశ్నలకు ఆమె పూర్తిస్థాయిలో సమాధానం ఇచ్చే పరిస్థితుల్లో లేరన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ సంరక్షణ కేంద్రానికి తరలించేందుకు అధికారులు ప్రయత్నించగా పిటిషనర్లు నిరాకరించారన్నారు. సీఆర్‌డీఏ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ శేషగిరమ్మ భర్త శేషగిరిరావు తమ అర ఎకరా భూమిని ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకి అప్పగించారన్నారు. ఇందుకు గాను 500 గజాల రెసిడెన్సియల్, 120 గజాల కమర్షియల్ ప్లాట్లు పొందారన్నారు. వీటిని గతంలోనే విక్రయించారన్నారు. పిటిషనర్లు ప్రస్తుతం నివాసం ఉంటున్న ఐదు సెంట్ల భూమిని సీఆర్‌డీఏకి అప్పగించారన్నారు. పిటిషనర్ల తరఫున న్యాయవాది బాలయ్య వాదనలు వినిపిస్తూ సంరక్షణ కేంద్రానికి వెళ్లేందుకు ఇష్టపడడం లేదన్నారు. ప్రస్తుత నివాసం వద్దే ఉండాలని కోరుకుంటున్నారన్నారు. పిటిషనర్లు కోరితేనే పిటిషన్‌లో చేర్చానన్నారు.

నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్

ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- పలువురు వక్తల ఆకాంక్ష



నాగుల్‌మీరాను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ శివనాథ్, షరీఫ్

వన్‌టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూర్‌బాషా, దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. సోమవారం తాడేపల్లిలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో నూర్‌బాషా, దూదేకుల సంక్షేమం కార్పొరేషన్ చైర్మన్‌గా నాగుల మీరా, 15 మంది డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. దీనికి హాజరైన వారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సలహాదారుడు ఎంఏ షరీఫ్ మాట్లాడుతూ నాగుల్‌మీరా నిబద్ధతతో పార్టీకి సేవలందించారన్నారు. ఆయన ఆధ్వర్యంలో నూర్‌బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆకాంక్షించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ టీడీపీలో క్రమశిక్షణ గల నేతగా నాగుల్ మీరాకు మంచి పేరుందన్నారు. ఆయన నూర్‌బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా 20 లక్షల మందికి సేవ చేసే అవకాశం లభించటం అదృష్టమన్నారు. నూర్‌బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కే నాగుల్ మీరా మాట్లాడుతూ తనకు ఈ అవకాశాన్ని కల్పించిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. చట్టసభల్లో నూర్‌బాషా సంఘానికి అవకాశం కల్పించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరికీ వారి వారిస్థాయిల్లో పదవులు లభిస్తాయన్నారు. నూర్‌బాషా దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ జాయింట్ ఎండీ భీమశంకర్‌రావు చైర్మన్ నాగుల్ మీరా, డైరెక్టర్లుగా బాషా లిమ్రా, ఇమామ్ హుస్సేన్, షేక్ బాలాజీ, దూదేకుల దస్తగిరి, దూదేకుల మహబూబ్ ఖాదీం, ఎం పేరుబాబు, షేక్ అల్తాఫ్, షేక్ హుస్సేన్, షేక్ ఇబ్రహింబాషా, షేక్ సుభాన్, రాళ్లపల్లి షరీఫ్, షేక్ సయ్యద్ ఆలీ జిన్నా, షేక్ షకూర్, షేక్ సిద్దయ్య, నాగుర్ వీరభద్రుడితో ప్రమాణ స్వీకారం చేయించారు. కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600



ఏపీ కాపు వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పుష్పావతి


పుష్పావతి

గుడ్లవల్లేరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చినగొన్నూరుకు చెందిన శాయిన పుష్పావతికి ఏపీ కాపు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. పుష్పావతి చినగొన్నూరు సర్పంచ్‌గా, గుడ్లవల్లేరు జడ్పీటీసీ సభ్యురాలిగా, కృష్ణా జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్‌గా పదవులు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శిగా పుష్పవతి ఉన్నారు. పుష్పవతికి రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్‌లో పదవి దక్కడం అభినందనీయమని మండలంలోని పలువురు టీడీపీ నేతలు ఆమెను అభినందించారు. పుష్పావతి భర్త ఎస్‌వీఎస్ ప్రసాద్(చిన గొన్నూరు ప్రసాద్) టీడీపీలో సీనియర్ నాయకుడు, నీటి సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.


జానకిరామయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పిస్తున్న ఆంజనేయులు, కొల్లి ఈశ్వరబాబు

జానకిరామయ్య సేవలు చిరస్మరణీయం

పామర్రు,నవంబరు10(ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్‌కు మాజీ చైర్మన్‌గా మండవ జానకిరామయ్య అందించిన సేవలు చిరస్మరనీయమైనవని ఆసంఘ ప్రస్తుత చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. స్థానిక పాలశీతల కేంద్ర సమావేశపు మందిరంలో సోమవారం జానకిరామయ్య మృతికి సంతాప సభ నిర్వహించి మండవ చిత్రపటానికి ఎండి ఈశ్వరబాబుతో కలిసి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లా పాలసంఘ సభ్యులు వేమూరి సాయి వెంకట రమణ, మేనేజరు గోపీనాథ్, పామర్రు సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

కూచిపూడి : పెదపూడిలో నూతనంగా నిర్మించనున్న అంకమ్మ తల్లి గుడి నిర్మాణ శంకుస్థాపన సందర్భంగా సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కుమార్ రాజా పాల్గొన్నారు. గ్రామస్థులు ఐక్యంగా గుడి నిర్మాణం చేపట్టడం అభినందనీయమన్నారు. రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగమనేని రామలింగేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు అస్తవ్యస్తం .. తప్పని తిప్పలు

- అధ్వానంగా డ్రెయినేజీలు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- పట్టించుకోని అధికారులు

(పామర్రు - ఆంధ్రజ్యోతి): పెదమద్దాలి దళితవాడలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. డ్రెయినేజీల్లో మురుగునీరు పారుదల సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే గుట్టలుగా పేరుకుపోతుంది. దీంతో కొద్దిపాటి వర్షానికే డ్రెయినేజీల్లోని మురుగునీరంతా పొంగి రహదారిపై వరదలా ప్రవహిస్తోంది. డ్రెయినేజీల్లో పేరుకుపోయిన పూడికను తొలగించమని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు. దీనికితోడు దోమలు వృద్ధి ఎక్కువగా ఉండటంతో ప్రజలు మలేరియా, డెంగ్యూ వంటి ప్రాణాంతక వ్యాధుల బారీన పడే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. గ్రామస్థాయి అధికారులు పారిశుధ్య పనులు మొక్కుబడిగా నిర్వహించడంతో


దళితవాడలో అపరిశుభ్రతతో ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల


కాలనీలోని రహదారిపై ప్రవహిస్తున్న మురుగునీరు

డ్రెయిన్లలో మురుగునీటి పారుదల సక్రమంగా జరగడం లేదని స్థానికుల నుంచి పలు విమర్శలు వినవస్తున్నాయి. కొద్ది పాటి వర్షానికే డ్రెయినేజీల్లోని మురుగునీరు రోడ్లపై, ఇళ్లలోకి చేరుతున్నాయి. దీంతో ప్రజలు మురుగు నీటిలో నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు రాకపోకల సమయాల్లో అదుపు తప్పి కిందపడిన సందర్భాలు ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి డ్రెయినేజీల్లోని పూడికను తొలగించేలా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రెయిన్లలో పూడిక తీయడం లేదు



పెదమద్దాలి హరిజన కాలనిలోని డ్రెయిన్లలో పూడికను పారిశుధ్య సిబ్బంది తొలగించడం లేదు. దీనిపై పంచాయతీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినప్పటికి పనులు జరగడం లేదు.

దేవరపల్లి దయామని

దోమల వృద్ధి అధికంగా ఉంది



డ్రెయినేజీలు అధ్వానంగా ఉండటంతో మురుగనీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దీంతో దోమల వృద్ధి అధికంగా ఉంటుంది. దీంతో డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రబలుతున్నాయి. జ్వరాలు వస్తే ఆసుపత్రికి వెళ్లెందుకు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

చాగంటి శ్రావణి

వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం

పెదమద్దాలి హరిజన కాలనీలోని డ్రెయిన్లలో పూడిక తీత పనులను త్వరలో చేపడతాం. వారం వ్యవధితో గ్రామంలోని డ్రెయిన్లలో పూడికను తొలగిస్తాం

పి. పూర్ణచంద్రరావు, పంచాయతీ కార్యదర్శి


కూచిపూడిలో వరి కోతలు కోస్తున్న కూలీలు

వరి కోతలు ప్రారంభం

కూచిపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఎంటీయూ 1061, ఎంటీయూ1318 రకాలకు చెందిన వరి వంగడాలు కోతకు సిద్ధం కావటంతో రైతులు వరి కోతలు ప్రారంభించారు. గత నెలలో సంభవించిన తుఫాన్ ప్రభావం కారణంగా వరి చేలు నేలకొరగటం కారణంగా కూలీల ఖర్చు ఈ ఏడాది అధికంగా అవుతున్నట్లు రైతులు తెలిపారు. తుఫాన్ ప్రభావానికి వీచిన గాలులు, వర్షాల కారణంగా పంట దెబ్బతినటంతో దిగుబడులు తగ్గే అవకాశం ఉందన్నారు.

రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. భట్లపెనుమర్రు రైతు సేవా కేంద్రం ఇంచార్జ్ అంజలి పర్యవేక్షణలో టెక్నికల్ అసిస్టెంట్ రాజేష్ రైతుల నుంచి ధాన్యం శాంపిల్స్ సేకరించి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం సూచించిన మిల్లులకు తరలిస్తున్నారు. ప్రస్తుతం యంత్రాల ద్వారా నూర్పిళ్లు ప్రారంభం కావటంతో రైతు సేవా కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తరలిస్తున్నారు. తేమ శాతాన్ని ప్రభుత్వం 17 శాతంగా నిర్ణయించగా, ప్రస్తుతం నూర్చిన ధాన్యం 25 నుంచి 30 వరకు తేమ ఉన్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ తెలిపారు. రైతుల సమ్మతితోనే కొనుగోళ్లు చేస్తున్నట్లు తెలిపారు.

కృష్ణామిల్క్ యూనియాన్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

పామర్రు, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతా ల్లో నానాటికి కనుమరుగుతున్న పశుసంతతిని వృద్ధి చేసేందుకు పశుపోషకులను ప్రోత్సహిస్తూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కృష్ణామిల్క్ యూనియాన్ సేవలు ఎంతో అభినందనీయమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. ఎలకుర్రులో పాలసేకరణ కేంద్రంలో పాలు అందించే పాడి రైతులకు 2024-25 ఏడాదికి గాను 126మందికి మంజూరైన రూ.1,45,779 బోనస్‌ను సోమవారం ఆసంఘ చైర్మన్ చలసాని ఆంజనేయులతో కలసి రైతులకు పంపిణీ చేసి సత్కరించారు. గ్రామ పాలసమితి అధ్యక్షుడు కోడే ఉమా మహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ మూగజీవాలకు ఉచితంగా వైద్యం సేవలు,


పాడిరైతులకు బోనస్ అందిస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

బెస్ట్‌సెమెన్ అందించడంతోపాటుగా, క్షీరబంధు, కల్యాణమస్తు, ప్రతిభ వంటి ఎన్నో పథకాలను అమలు చేయడం మరేన్నో పాల సంఘాలకు ఆదర్శనీయమన్నారు. ప్రభుత్వ సహకారంతో గ్రామీణ పాల ఉత్పత్తిదార్లకు కృష్ణమిల్క్ యూనియాన్ అందిస్తున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలక మండలి సభ్యులు సాయి వెంకట రమణ, దామోదరకృష్ణ, గోపినాథ్ పాల్గొన్నారు.

శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు

గుడివాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీక మాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకర స్వామి దేవస్థానాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. స్వామికి విశేషపూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపపూజలు నిర్వహించారు. ఆలయాల్లో కార్తీకమాసోత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయని, విచ్చేస్తున్న భక్తులకు ఎటువంటి సౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఈవో వేణుగోపాలరావు పేర్కొన్నారు.

పామర్రు : శివునికి ప్రీతిపాత్రమైన కార్తీక మాసం మూడో సోమవారం కావడంతో ప్రసిద్ధిగాంచిన పామర్రు శివాలయం భక్తులతో పోటెత్తింది. వేకువజామునే భక్తులు విశేషసంఖ్యలో ఆలయానికి చేరుకుని కుటుంబ సమేతంగా ధ్వజస్తంభంతో పాటు ఆలయప్రాంగణంలో గల ఉసిరి , జమ్మి, తులసి వృక్షాల వద్ద సామూహిక కార్తీక దీపారాధనలు చేసారు. అనంతరం పార్వతి పరమేశ్వరులను క్యూలైన్ల ద్వారా దర్శించుకుని అభిషేకాలు, ఇతర పూజాదికాలు జరిపించుకున్నారు. దీనితోపాటు అయప్ప స్వామి ఆలయ ప్రాంగణాలు అయప్ప, శివనామస్మరణలతో మార్మోగింది. భక్తులతో పాటు అయ్యప్ప, భవాని, శివ మాలా దీక్షాపరులు స్వామిని దర్శించుకోవడంతో ఆలయం పోటెత్తింది. మండలంలోని పలు శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

గుడ్లవల్లేరు : కార్తీక మాసం మూడవ సోమవారం భక్తులు శివాలయాల్లో పోటెత్తారు. మండలంలో గుడ్లవల్లేరులోని శ్రీమత్ గంగా పార్వతీ సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో, కన్యకాపరమేశ్వరీ పంచాయతీ క్షేత్రంలోని శివాలయం, అంగలూరు అమరేశ్వరస్వామికి, కౌతవరం గౌతమేశ్వరస్వామి ఆలయంలో, విన్నకోట సిద్ధేశ్వరస్వామి ఆలయంలో, పెసరమిల్లి, డోకిపర్రు శివాలయాలలో ప్రత్యే పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దీపారాధనలు నిర్వహించారు.


గుడ్లవల్లేరు సిద్దేశ్వర స్వామి ఆలయంలో దీపార్చన చేస్తున్న భక్తులు


పామర్రు శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

బీరువా వితరణ

గుడివాడ రూరల్: రామన్నపూడి యూపీ పాఠశాలకు రామన్నపూడి పీఏసీఎస్ చైర్మన్ సూరపనేని రామకృష్ణ ఉచితంగా పది వేల విలువ చేసే బీరువాను ఉచితంగా పాఠశాలకు అందించారు. హెచ్‌ఎం నరసింహారావు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కూచిపూడి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిడుమోలు శివారు మల్లేశ్వరం గ్రామస్థులు భట్టు భానోదయ రూ.20 వేలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును, నిడుమోలు గ్రామస్థులు లావుడియా నాగకోటేశ్వరరావు నాయక్‌కి రూ.52,184 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా చేతులమీదుగా సోమవారం లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎవరూ అధైర్యపడొద్దు

- ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

పామర్రు: ఇటీవల సంభవించిన తుఫాన్ వల్ల పంటదెబ్బ తిన్న రైతాంగానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎవరూ అధైర్య చెందవద్దని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రులో సోమవారం దెబ్బతిన్నా పంట క్షేత్రాలను ఆయన పరిశీలించి రైతులను వివరాలు అడిగితెలుసుకున్నారు. అనంతరం రైతన్నలకు ప్రభుత్వం ఆదుకుటుందని ఏఒక్కరైతు అధైర్య చెందవద్దని ధైర్యం చెప్పారు. అనంతరం సీఎం సహాయనిధినుంచి ఆనారోగ్య బాధితులకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రూ.42,292నగదుచెక్కును పరసా దానియేలుకు, మరొక్కరైన కోడే రమేష్‌కు మంజూరైన రూ.78,916 నగదు చెక్కు వారి ఇళ్ల వద్దకు వచ్చి ఎమ్మెల్యే కుమార్ రాజా అందజేశారు.

నూతన కరెంటు స్తంభాల ఏర్పాటు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులో పంచాయతీ నిధులు రూ 4.67 లక్షలతో కొత్తగా 17 కరెంటు స్తంభాలు వేసి లైన్‌లాగించి వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ పెనుముత్స రాధిక తెలిపారు. కొత్త కరెంటు లైన్ వద్ద సోమవారం పూజ నిర్వహించి కొబ్బరికాయ కొట్టారు. రజకపేటలో 7 స్తంభాలు, మల్కాపురంలో 4 స్తంభాలు, వివిధ ప్రదేశాల్లో మొత్తం 17 కొత్త స్తంభాలను వేయించమని సర్పంచ్ తెలిపారు.

మాంటిస్సోరిలో బాలోత్సవం 29నుంచి

గుడివాడ రూరల్ : గుడివాడ మాంటిస్సోరి హైస్కూల్‌లో వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నవంబరు 29, 30వ తేదీల్లో నిర్వహించే బాలోత్సవం కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ జయప్రదం చేయాలని గుడివాడ ఎంఈవో-2 బాలాజీ విజ్ఞప్తి చేశారు. గుడివాడ ఎంఈవో కార్యాలయంలో బాలోత్సవానికి సంబంధించి బ్రోచర్లను నిర్వాహకులతో కలసి ఆయన ఆవిష్కరించారు. నవంబరు 29, 30 తేదీల్లో ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించే కార్యక్రమాలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు జయప్రదం చేయాలని ఎంఈవో కోరారు. గుడ్లవల్లేరు మండల ఎంఈవో-2 గోపాల్, బాలోత్సవం అధ్యక్షుడు సనకా సుబ్బారావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

గుడివాడ : పరిశ్రమల్లో పాటించాల్సిన చట్టాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని క్వాలిటీ ఫీడ్స్ హెచ్‌ఆర్ మేనేజర్ టి.రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో పరిశ్రమల్లో చట్టాన్ని నిర్వచించడం, దాని ఆవశ్యకతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులకు ముఖ్యవక్తగా విచ్చేసిన రామకృష్ణ మాట్లాడుతూ పరిశ్రమల్లో పాటించాల్సిన చట్టాలు, లేబర్ లాస్, ఇండస్ట్రియల్ రిలేషన్స్, ఇండస్ట్రియల్ డిస్ప్యూట్స్ వంటి అంశాల గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్‌ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సువర్చల పాల్గొన్నారు





మచిలీపట్నం

• మచిలీపట్నం • పెడన • అవనిగడ్డ

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 600



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో వినియోగదారుల కమిషన్ రిజిస్ట్రార్



మోపిదేవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ వినియోగదారుల కమిషన్ రిజిస్ట్రార్ ఎస్.ఎస్.శ్రీనివాసరావు కుటుంబ సమేతంగా సోమవారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షకులు మధుసూదనరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు ఆయనకు అందించారు.



పెదప్రోలు, మల్లవోలులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న డీటీ వాణి, ఏవో హెబ్సిబారాణి, టీడీపీ నేత పోతన స్వామి, ఏవో శివరామకృష్ణ

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

మోపిదేవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ ఎం.వాణి, మండల వ్యవసాయ శాఖాధికారి కె.హెబ్సిబా రాణి తెలిపారు. పెదప్రోలు పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభించారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని తెలిపారు. ధాన్యాన్ని విక్రయించిన 48 గంటల్లో వారి ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు నాదెళ్ల శరత్ చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఈవో వేముల నాగమణి, గ్రామసర్పంచ్ పోలిమెట్ల ఏసుబాబు, ఆర్ఐ విశ్వనాథ్, వీఆర్వో నాగమల్లేశ్వరరావు, రైతులు కుర్రా గురు ప్రసాద్, నాదెళ్ల రాజేష్, చంద్ర రామకృష్ణ, బాసు శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. **గూడూరు** : మల్లవోలు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం డీసీ చైర్మన్ పోతన స్వామి ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎటువంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించాలన్నారు. రైతులు పంటను ప్రభుత్వానికి అమ్మి లబ్ధిపొందాలన్నారు. ఏవో శివరామకృష్ణ, బాసంశెట్టి శ్రీను, ముద్దినేని కొండ, గోపీ నాగబాబు, ఎస్‌ఏ బేగ్, బత్తిన వీరబాబు, పడవల మోహన్ త్రినాథ్, బత్తిన బుజ్జి, మురాల నాని, అల్లు బాల, నరసింహారావు, రామయ్య, బ్యాంక్ కార్యదర్శి గణేష్, రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరలపై పోస్టర్లు ఆవిష్కరణ

నాగాయలంక: వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరల పోస్టర్లను సోమవారం దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. వైస్ చైర్మన్ రాజనాల వీరబాబు, పాలకవర్గ సభ్యులు, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

బంటుమిల్లి కాల్వ కింద దాళ్వా అనుమతికి కృషి

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్



బంటుమిల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బంటుమిల్లి ప్రధాన కాల్వ పరిధిలో దాళ్వాసాగు విషయమై ప్రభుత్వంతో చర్చిస్తానని మాజీ శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంటుమిల్లి ప్రధాన కాల్వ పరిధిలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో రెండోపంట దాళ్వా సాగుకు అనుమతి ఇవ్వాలని, తీర ప్రాంతం కావడంతో అపరాల పండే అవకాశం తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోతున్నారన్నారు. రెండో పంట దాళ్వా సాగుకు అనుమతులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళతానని ఆయన తెలిపారు. పెడన ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కూడా ఈ విషయంలో అనుకూలంగా ఉన్నారని, త్వరగా నిర్ణయం తీసుకునేందుకు జిల్లా స్థాయి ఇరిగేషన్ బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.



రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అభిభాషణ చేస్తున్న స్థైర్యానంద సరస్వతి



నాగాయలంకలో అభిషేకం చేస్తున్న భక్తులు



కె.కొత్తపాలెం ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు

భగవద్గీత పఠనంతో విజయం తథ్యం

● స్వామి స్థైర్యానంద సరస్వతి ● ఆలయాల్లో కార్తీక పూజలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీతలో ఎన్నో జీవిత రహస్యాలు దాగి ఉన్నాయని, బాల్యం నుంచి భగవద్గీత నేర్చితే విజయాలు సాధించవచ్చని గుడివాడ ప్రణవాశ్రమం పీఠాధిపతి స్థైర్యానంద సరస్వతి స్వామి అన్నారు. రామలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా విద్యార్థులకు సోమవారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. భక్తి యోగం, గుణత్రయ యోగం కంఠస్థ పోటీలు నిర్వహించారు. కొడాలి శ్రీనివాస విద్యాలయం చిన్నారులు అనర్గళంగా భగవద్గీత శ్లోకాలు చదివి, అతిథులను అబ్బుర పరిచారు. దేసు సుబ్రహ్మణ్యం ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు చొప్పున నగదు బహుమతి అందజేశారు. విజేతలకు స్థైర్యానంద సరస్వతి స్వామీజీ, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, ఈవో సమ్మెట ఆంజనేయస్వామి, స్టార్ కళాశాల అధినేత పి శ్రీరామ్ బహుమతులు అందజేశారు. భగవద్గీత నేర్పుతున్న గొడుగుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబరు జొన్నలగడ్డ మాధవిని స్వామీజీ అభినందించారు. పోటీలకు సంస్కృత పండితురాలు వేమూరి భవానీ, జొన్నలగడ్డ మాధవి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. అనంతరం అంబటిపూడి సుబ్రహ్మణ్యం కార్తీక పురాణంలోని ఘట్టాలను వివరించారు.



చిన్నారులను అభినందిస్తున్న చైర్మన్ దేసు



బందరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

ఆలయాల్లో దీపశోభ

కార్తీక సోమవారం సందర్భంగా మచిలీపట్నంలోని ప్రధాన దేవాలయాల్లో భక్తులు దీపారాధనలు చేశారు. కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయం, గాంధీబొమ్మ శివాలయం, బచ్చుపేట శివాలయం, బందరుకోట రామాలయం, గొడుగుపేట శివాలయం, రాబర్ట్సన్‌పేట రామలింగేశ్వరస్వామి దేవాలయం, సర్కిల్‌పేట శివాలయం, కొజ్జిలిపేట శివాలయం తదితర ఆలయాలలో భక్తులు ఉదయం స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయాలకు విచ్చేసి దీపారాధనలు చేశారు. ఆకాశదీపాలు వెలిగించారు. **నాగాయలంక** : శ్రీరామపాదక్షేత్రంలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో మూడో కార్తీక సోమవారం సందర్భంగా విశేష పూజలు జరిపారు. భక్తులు పుష్కరఘాట్‌లో పుణ్యస్నానాలు చేసి కార్తీక దీపాలను వెలిగించారు. దీపాలను అరటి డొప్పలలో నదిలోకి వదిలారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, ఉప్పల లీలా కృష్ణ ప్రసాద్ తదితరులు పర్యవేక్షించారు. **చల్లపల్లి** : కార్తీక మాసం మూడో సోమవారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిమాన్విత పృథ్వీశ్వరస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అన్నపూర్ణాసమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయం, లక్ష్మీపురందుర్గాపార్వతీసమేత సోమేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పెద్దఎత్తున తరలివెళ్లి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయాల ఆవరణలో దీపారాధనలు చేశారు. సోమేశ్వరస్వామిని రుద్రాక్షలతో అలంకరించారు.

వేకనూరులో..

అవనిగడ్డ రూరల్ : వేకనూరు ఉభయ ముక్తీశ్వరస్వామి క్షేత్రంలో పార్వతీ అమ్మవారికి సోమవారం ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకుడు ఘంటసాల వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేయగా భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. తొలుత అమ్మవారికి దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేకనూరు సంతాన వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష తులసీ దళార్చన సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకుడు దీవి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో 11 మంది రుత్వికులు లక్ష తులసీ దళార్చన చేశారు.

వైభవంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలు

మోపిదేవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కె.కొత్తపాలెం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు పులిపాక మూర్తి ప్రత్యేక పూజలు చేసి విశేష అలంకరణ చేశారు. 120 మంది భక్తులు రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతాలు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దుర్గానాగేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే మండలి

మోపిదేవి : ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఆంజనేయులుతో కలసి పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అర్చక బృందం వేద మంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రసాదాలను అందజేశారు.



కోడూరులో సహస్ర లింగార్చన

కోడూరు : కోడూరు శివాలయ ప్రాంగణంలో సోమవారం ప్రధాన అర్చకులు శివరామకృష్ణ, వేదపండితులు ముట్లూరు శాస్త్రి లక్ష్మీగణపతి, రుద్ర, నవగ్రహ, సుదర్శన హోమాలు చేశారు. దంపతులచే సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సహస్ర లింగార్చన వైభవంగా నిర్వహించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



మర్యాదపూర్వక కలయిక

మచిలీపట్నం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును సోమవారం జనసేన నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. గడ్డం రాజు, తదితరులు పాల్గొన్నారు.



సీపీ బ్రౌన్ సేవలు చిరస్మరణీయం : మండలి

అవనిగడ్డ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాష, సాహిత్యాన్ని కాపాడిన గొప్ప వ్యక్తి బ్రౌన్ అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలోని తన కార్యాలయంలో బ్రౌన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. తాళపత్రాలు, రాగిరేకులపై ఉన్న తెలు గు భాషా, సాహిత్యాన్ని గ్రంథస్థం చేసి నేటి తరానికి అందేవిధంగా చార్లెస్ బ్రౌన్ విశేష కృషి చేశారన్నారు. మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, బచ్చు రఘునాథ్ ప్రసాద్, ఆవుల రేవతి, ఆవుల ధర్మవెంకట నరసయ్య, రేపల్లె రవీంద్ర, చలాది రాజనాగమునేశ్వరరావు, తోట శ్రీనివాసరావు, ఎనుముల నాగేశ్వరరావు, గుడిసేవ విష్ణుప్రసాద్, లోయ నాగ శ్రీనివాసరావు, ఘంటసాల రాజమోహనరావు, బండే రాఘవ, సిద్ధినేని అశోక్ నాయుడు, మండలి రామ్మోహనరావు, అడపా శ్రీను పాల్గొన్నారు.



పెదకళ్లేపల్లిలో మహనీయులకు నివాళి

మోపిదేవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సంగీత సాహిత్య రంగాల్లో ప్రముఖులు, పెదకళ్లేపల్లి గ్రామంలో జన్మించిన మహనీయుల విగ్రహాలకు లయన్స్‌క్లబ్ ప్రతినిధులతో కలసి బుద్ధప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంగీత సామ్రాట్ సుసర్ల దక్షిణామూర్తి, సాహిత్యమూర్తులు వేటూరి ప్రభాకరశాస్త్రి, వేటూరి సుందరరామ్మూర్తి, జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైస్ ఎంపీపీ కడవకొల్లు సీతారామాంజనేయులు, సర్పంచ్ అరజా సంధ్యారాణి, ఎంపిటిసి అరజా ఆశాదేవి, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు గొర్రెపాటి రమేష్ చంద్రబాబు పాల్గొన్నారు.

ఉగాది పురస్కార గ్రహీత సింహాద్రి వాణికి సత్కారం

అవనిగడ్డ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బందలాయిచెరువులో మాజీ మంత్రి సింహాద్రి సత్యనారాయణరావు మామిడితోటలో సోమవారం సింహాద్రి కుటుంబాల కార్తీక వన భోజనాలు జరిగాయి. ఆబాల గోపాలం పాల్గొని ఆటపాటలతో ఆనందంగా గడిపారు. సింహాద్రి వారి ఆడపడుచు, ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు చేతులమీదుగా విశ్వావసు నామ సంవత్సరం ఉగాది పురస్కారం అందుకున్న సింహాద్రి వాణి ముఖ్యఅతిథిగా విచ్చేయగా సింహాద్రి వంశీయులు ఆమెను ఘనంగా సత్కరించారు.

దళిత, గిరిజన, మైనారిటీలపై దాడులను నిరసిస్తూ ఆందోళన 18న

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.వి.వి.ప్రసాద్

చల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సామాజిక న్యాయం, సమానత్వ సాధన, ఆత్మగౌరవం కోసం దేశవ్యాపిత ఆందోళనలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) జాతీయ సమితి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 18వ తేదీన రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మోదీ అధికారం చేపట్టిన 11 ఏళ్ల కాలంలో దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలపై దాడులు మితిమీరిపోయాయన్నారు. అణిచివేత, అంటరానితనం, కులమత వివక్ష, హింస పేట్రేగిపోతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు.. భారత రాజ్యాంగం, ప్రజాస్వామిక హక్కులను హరించే దుష్టశక్తులను తిప్పికొట్టేందుకు ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో 18వ తేదీన చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, పెనుమత్స రాజారత్నం పాల్గొన్నారు.

పోస్టాఫీస్ పథకాలను సద్వినియోగం చేసుకోండి



ప్రమాద బీమా చెక్కు అందజేస్తున్న పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు

చల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తపాలా శాఖ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మచిలీపట్నం పోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మంగళాపురం గ్రామానికి చెందిన రైతు నిడమానూరి గోపీకృష్ణ పోస్టాఫీసులో రూ.799 చెల్లించి రూ.15 లక్షల ప్రమాదబీమా తీసుకున్నారు. జూన్‌లో పాముకాటుకు గురై చనిపోయాడు. బీమా పరిహారం రూ.15 లక్షల చెక్కును మృతుని భార్య శివకుమారికి సోమవారంపోస్టల్ సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు మంగళాపురం వచ్చి బాధిత కుటుంబానికి చెక్కు అందజేశారు. అవనిగడ్డ ఏఎస్పీ టి.నాగరాజు, ఐపీపీబి సీనియర్ మేనేజర్ కె.వి.అనుదీప్, మేనేజర్ ఎల్.సాయితేజ, పోస్టుమాస్టర్‌లు అనిల్, చంద్ర పద్మ, గోవర్ధనరావు, డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, చంద్ర పిచ్చియ్య, పరుచూరి కమలాకరరావు, చంద్ర గురుప్రసాద్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాకవి అందెశ్రీకి కొవ్వొత్తుల నివాళి

● ఎమ్మెల్యే మండలి, సాహితీవేత్తల సంతాపం

చల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి, రచయిత, మానవతావాది అందెశ్రీ మృతికి సంతాపం ప్రకటిస్తూ చల్లపల్లిలో ప్రజాసంఘాల నేతలు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. చంద్ర రాజేశ్వరరావు వికాసకేంద్రంలో సోమవారం రాత్రి అందెశ్రీ సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు దాసి సీతారామరాజు, ఉప్పల సాంబశివరావు, దిరిశం వెంకట్రావ్, సిద్ధాబత్తుల వాసు, మల్లుపెద్ది రాజా, వీఆర్వో ఓగిరాల నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అందెశ్రీ మరణం తెలుగుప్రజలకు తీరని లోటని తెలిపారు. **నాగాయలంక** : ప్రజాకవి, తెలుగు వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ ఆకస్మిక మృతి పట్ల దివిసీమ కవులు, రచయితలు తమ ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. అక్షర జ్ఞానం లేకపోయినా అందెశ్రీ వాగ్దేవి ప్రసన్నంతో అపూర్వ గేయాలను రాసి తెలుగువారికి అందించారని ఉగాది పురస్కర గ్రహీత సింహాద్రి వాణి, నడకుదుటి రాధాకృష్ణమూర్తి, చన్నగిరి లతామోహన్, కన్నా రాజు, జి.సూర్యనారాయణ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. **అవనిగడ్డ** : ప్రముఖ కవి అందె ఎల్లయ్య మృతి తెలుగు సాహిత్య రంగానికి తీరని లోటని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అందె ఎల్లయ్య మృతి పట్ల బుద్ధప్రసాద్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో సంతాపం వ్యక్తం చేస్తూ చదువు లేకపోయినా కవిత్వంతో ఎన్నో గీతాలను రచించారన్నారు.

ప్రార్థనా మందిరానికి టేబుల్, కుర్చీల వితరణ

చల్లపల్లి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణరావునగర్‌లోని జీసెస్ గాస్పెల్ మినిస్ట్రీ ఇండియా ప్రార్థనా మందిరాన్ని జనసేన నేత ఎ.పి.చంద్రశేఖరరావు ప్రారంభించి టేబుల్, కుర్చీలను బహూకరించారు. క్రీస్తుబోధనలు మానవాళికి శాంతిని చేకూరుస్తాయని తెలిపారు. కొడాలి నవమణి, మిరియాల జితేంద్ర, కైతేపల్లి భానుప్రకాష్, కుమారి, మేరి, కరుణమ్మ, ప్రేమకుమారి రులు పాల్గొన్నారు.

స్వామిత్వ సర్వేతో ఆస్తుల ధ్రువీకరణ

పెడన రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వే వలన గ్రామాల్లో ప్రజల ఆస్తులకు కచ్చితమైన ధ్రువీకరణ పత్రాలు అందుతాయని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. పెనుమల్లి సచివాలయంలో స్వామిత్వ గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో 396 మంది నివాసం ఉంటున్నట్లు పంచాయతీ రికార్డులలో నమోదై ఉందన్నారు. వారి వారి నివాస సరిహద్దు వివరాలతోపాటు స్థలం విస్తీర్ణం తెలుపుతూ డ్రోన్‌లద్వారా కొలతలు నిర్ణయిస్తారన్నారు. తేడా ఉంటే గ్రామసభల దృష్టికితీసుకు వచ్చి సరిచేసుకునే వీలుందన్నారు. డిప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు నగేష్, సర్పంచి రామానాయుడు, సెక్రటరీ కరీముల్లా, నాగరాజు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మచిలీపట్నం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గుండె ఆపరేషన్ చేయించుకున్న గోపాల్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.42,200 చెక్కును సోమవారం మాజీ మున్సిపల్ చైర్మన్ బాబాప్రసాద్ అందజేశారు. పుప్పాల ప్రసాద్, డి సుధాకర్, కిరణ్, ఖలీల్, నాగరాజు, సత్యం, మురళి, గణేష్, జ్ఞానేశ్వరరావు, పాండు, అనురాధ, నాగలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

మోపిదేవి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలి వెంకట కృష్ణారావు శతజయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ పెదకళ్లేపల్లి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం, ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ 316డి గవర్నర్ వి.వి.పిఎస్.ఆంజనేయులు విచ్చేసి శిబిరాలను ప్రారంభించారు. పెదకళ్లేపల్లి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు గొర్రెపాటి సురేష్ చంద్ర అధ్యక్షతన జరిగిన నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రామ్ మత్తి శ్రీనివాసరావు, మత్తి వెంకటేశ్వరరావు, ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు, లయన్స్ పాల్గొన్నారు.

కృష్ణమూర్తికి టీడీపీ నివాళి

కోడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నక్కవానిదారి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు అప్పికట్ల కృష్ణమూర్తి అనారోగ్యంతో మృతి చెందారు. మండల టీడీపీ నాయకులు కృష్ణమూర్తి మృతదేహాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బండే శ్రీనివాసరావు, కడవకొల్లు నాంచారయ్య, అప్పికట్ల రవీంద్ర బాబు, కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, వేములపల్లి శ్రీకృష్ణ, కోట సుబ్బారావు పాల్గొన్నారు.

బర్రంకులలో వైద్యశిబిరం నేడు

నాగాయలంక, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి మండలి వెంకట కృష్ణారావు శజయంతి ఉత్సవాల 100వ రోజు సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బర్రంకుల గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలిపింది. ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పాల్గొంటారని శతజయంతి నిర్వహణ కమిటీ అధ్యక్షుడు తలశిల స్వర్ణలత, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు తెలిపారు. కూటమి నేతలు విరివిగా తరలి రావాలని వారు కోరారు.

ప్రమాద బాధితుడికి సాయం

మచిలీపట్నం టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రోడ్డుప్రమాదంలో గాయపడిన అబ్దుల్ సత్తార్‌కు సీఎం రిలీఫ్‌ఫండ్ రూ.20 వేలు రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ హసీంబేగ్ అందజేశారు. ఇలియాస్ బాషా, అబ్దుల్ అజీం, డివిజన్ ఇన్‌చార్జి షేక్ ఫిరోజ్ , కాగిత రామకృష్ణ, కాగిత రమేష్, మొహమ్మద్ సర్దారి ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.